తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | సోమవారం-28- ఏప్రిల్ 2025 | సంపుటి : 2 | సంచిక : 337 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




# తెలంగాణకు విలన్ నంబర్-1 కాంగ్రెస్

- ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఒక్కడినే బయల్దేరా..
- అన్నింటినీ అధిగమించి పోరాడి తెలంగాణను సాధించాను: కేసీఆర్
- రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాం..
- ఎన్నోన్నో పథకాలు అమలు చేశాం
- దిల్లీ నుంచి వచ్చిన నకిలీ గాంధీలు ఎన్నో హామీలిచ్చారు
- అప్పు పుడతలేదని దివాలా మాటలు..
- ఆపరేషన్ కగార్ ఆపేయాలి

వరంగల్, (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ రాష్ట్రానికి కాంగ్రెస్ పార్టీ విలన్ నంబర్ 1 అని భారాస అధినేత కేసీఆర్ అన్నారు. 1956లో బలవంతంగా ఆంధ్రతో కలిపింది జవహర్‌లాల్ నెహ్రూ అయితే, 1969లో తెలంగాణ ఉద్యమం వస్తే.. మళ్లీ కాంగ్రెస్ పార్టీ నిరంకుశంగా అణచివేసిందని విమర్శించారు. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడైనా తెలంగాణకు మొదటి విలన్ కాంగ్రెస్ పార్టీయేనని వ్యాఖ్యానించారు. భారాస రజతోత్సవ వేడుకల సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో కేసీఆర్ పాల్గొన్నారు. తొలుత జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపంగా నిమిషం పాటు మౌనం పాటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... వలసవాదుల విషకౌగిలిలో నలిగిపోతున్న నా భూమికి విముక్తి కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేక తెలంగాణ సాధన కోసం ఒక్కడినే బయల్దేరానని అన్నారు. ఆ సమయంలో కొందరు వెటకారం చేశారని, అన్నింటినీ అధిగమించి పోరాడి తెలంగాణను సాధించానని చెప్పారు. ప్రజలు దీవిస్తే పదేళ్లపాటు ధగధగలాడే తెలంగాణను తయారు చేసుకున్నామన్నారు. “1969లో మూగబోయిన తెలంగాణ ఉద్యమానికి మళ్లీ జీవం పోశాను.

మిగతా 2లో..





## సీఎం రేవంత్‌తో శాంతి చర్చల కమిటీ నేతల సమావేశం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో శాంతి చర్చల కమిటీ నేతలు సమావేశమయ్యారు. జూబ్లీ హిల్స్ నివాసంలో సీఎం రేవంత్ తో వారు భేటీ అయ్యారు. సీఎం రేవంత్ తో బేటీ అయిన వారిలో జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, దుర్గా ప్రసాద్, జంపన్న, రవిచందర్ లు ఉన్నారు. మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరిపేలా చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మావోయిస్టులపై కాల్పుల విరమణకు కేంద్రాన్ని ఒప్పించాలని సీఎం రేవంత్ ను వారు కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్ కు వినతి పత్రం అందజేశారు శాంతి చర్చల కమిటీ నేతలు. మంత్రులతో చర్చించి ఒక నిర్ణయం తీసుకుంటాం

దీనిపై సీఎం రేవంత్ వారితో మాట్లాడుతూ..

మిగతా 2లో..

## కర్రెగుట్టల్లో భారీ సొరంగం..

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు):

ఛత్తీస్‌గఢ్‌తెలంగాణ సరిహద్దు కర్రెగుట్టల్లో ఆరోరోజూ భద్రతా దళాల కూంబింగ్ కొనసాగుతోంది. మావోయిస్టుల కోసం ఇక్కడి అడవుల్లో ముమ్మరంగా గాలింపు చేపట్టారు. కర్రెగుట్టలను అన్నివైపుల నుంచి చుట్టుముట్టారు. ఈక్రమంలో భద్రతా బలగాలు భారీ సొరంగాన్ని గుర్తించాయి. వెయ్యి మంది తలదాచుకునేందుకు వీలుగా దీని నిర్మాణం ఉంది. లోపల పెద్ద మైదానంతో విశాలంగా ఉన్న సొరంగాన్ని గుర్తించారు. ఇందులో నీటి వసతి, ఇతర సౌకర్యాలున్నట్లు సమాచారం.

మిగతా 2లో..

## కాంగ్రెస్‌పై కేసీఆర్ విషం కక్కారు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు):

కేసీఆర్ మనసంతా విషంతో నిండిపోయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయన ప్రసంగం మొత్తంలో కాంగ్రెస్‌ను విలన్‌లా చిత్రీకరించడం తప్ప ఇంకేమీ లేదని విమర్శించారు. మంచి సలహాలు, సూచనలు ఇస్తారేమోనని కేసీఆర్ ప్రసంగం విన్నామని, అందులో ఏమీ లేదని ఎద్దేవా చేశారు. భారాస రజతోత్సవాల సందర్భంగా ఎల్కతుర్తిలో భారాస అధినేత కేసీఆర్ చేసిన ప్రసంగంపై మంత్రులు సీతక్క, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ తీరును తప్పుబట్టారు.

“గత సీఎం పరిపాలన వల్ల ధనిక రాష్ట్రం అప్పులపాలైంది. అప్పులున్నా.. ప్రజలకు సంక్షేమం అందిస్తున్నాం. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్‌ను విలన్‌గా చిత్రీకరిస్తున్నారా? కడుపంతా విషం నింపుకొని కేసీఆర్ మాట్లాడటం బాధ కలిగించింది. రెండుసార్లు భారాసకు అధికారం ఇస్తే.. ఎలా కొల్లగొట్టారో ప్రజలు గమనించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి.. మంచి సలహాలు ఇస్తారని ఎదురుచూశాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఐదారు పర్యాయాలు అసెంబ్లీ జరిగింది. కేవలం రెండుసార్లే కేసీఆర్ వచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు సచివాలయానికి కూడా కేసీఆర్ వెళ్లలేదు.

మిగతా 2లో..



## పాకిస్థానీయులకు ముగిసిన డెడ్‌లైన్..



న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు):

పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాక్‌తో సరిహద్దును మూసివేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఇందుకోసం స్వల్పకాలిక వీసాలున్న వారికి కేంద్ర ప్రభుత్వం విధించిన గడువు ఏప్రిల్ 27తో ముగిసింది. దీంతో ఇప్పటి వరకు 537 మంది పాక్ జాతీయులు అట్టారీవాఘా సరిహద్దు మార్గంలో పాకిస్థాన్‌కు వెళ్లిపోయినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

మిగతా 6లో..





## ఎప్పుడైనా సరే రెడీ..

న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు):

ఎనీటైమ్ (ఎప్పుడైనా).. ఎనీవేర్ (ఎక్కడైనా).. ఎనీహౌ (ఏమైనా సరే) సందేశం పంపింది ఇండియన్ నేవీ. పెహల్గామ్ ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్ పై కఠినమైన ఆంక్షలకు సిద్ధమైన భారత్..

మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: హల్దిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# తెలంగాణకు విలన్ నంబర్-1 కాంగ్రెస్

(మొదటి పేజీ తరువాయి)

కొండా లక్ష్మణ్ బాపూజీ నివాసమైన జలదృశ్యం వేదికగా తెరాస ఆవిర్భావం జరిగింది. ఉద్యమ జెండాను దించితే నన్ను రాళ్లతో కొట్టి చంపమని ఆనాడు చెప్పాను. 60 ఏళ్ల సమైక్య పాలనలో తెలంగాణ ప్రజలు ఎన్ని బాధలు పడ్డారో నాకు తెలుసు. ఆనాడు కాంగ్రెస్, తెదేపాలో ఉన్న నేతలు పదవుల కోసం పెదాలు మూసుకొని కూర్చున్నారు. శాసన సభలో తెలంగాణ అనే పదమే ఉపయోగించవద్దని రూలింగ్ ఇచ్చారు. తెరాస ఏర్పాటు తర్వాత మలిదశ ఉద్యమం ఉద్ధృతమైంది. సాగరహారం, వంటావార్పు, సకలజనుల సమ్మె వంటి కార్యక్రమాలతో ఉద్యమాన్ని ఉద్ధృతం చేశాం.

సాధించుకున్న తెలంగాణలో ప్రజలు దీవించి పదేళ్లపాటు అవకాశమిస్తే.. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాం. ప్రాజెక్టులు నిర్మించి సాగుభూమిని గణనీయంగా పెంచాం. మూడేళ్లలోనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించాం. అద్భుతమైన తెలంగాణను నిర్మించుకున్నాం. పంజాబ్‌ను తలదన్నేలా పంటలు పండే రాష్ట్రాన్ని నిర్మించుకున్నాం. షేర్‌షా కాలం నుంచి స్వాతంత్ర్యం వచ్చే వరకు రైతుల నుంచి ఎన్నో పన్నులు వసూలు చేశారు. వారి నుంచి పన్నులు వసూలు చేసిన వారే తప్ప.. వారికి మేలు చేసిన వాళ్లు లేరు. రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే పట్టించుకున్న నాథుడు లేడు.

**ఎన్నోన్నో పథకాలు అమలు చేశాం**

రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు రైతుబంధు పథకం తీసుకొచ్చాను. రైతుబీమా అమలు చేసి రైతు కుటుంబాలను ఆదుకున్నాం. భారాస హయాంలో రైతుబంధు పథకం నిరాటంకంగా అమలైంది. వానాకాలం, యాసంగి పంటలకు సకాలంలో రైతుబంధు జమచేశాం. ఎన్నికల అజెండాలో చెప్పని ఎన్నో పథకాలను అమలు చేశాం. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కల్యాణలక్ష్మి, చేపల పెంపకం వంటివి అమలు చేశాం. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించి ఉద్యోగ అవకాశాలు పెరిగేలా చేశాం. రాష్ట్రంలో 3 మాత్రమే ఉన్న వైద్య కళాశాలల సంఖ్యను 33కి పెంచాం.

**తెలంగాణకు ఏం బీమారి వచ్చింది?**

ఎన్నో అద్భుతాలు సాధించుకున్న తెలంగాణకు ఇవాళ ఏం బీమారి వచ్చింది. కాంగ్రెస్ నేతలు ఎన్నికల ముందు ఎన్నెన్నో చెప్పారు. దిల్లీ నుంచి వచ్చిన నకిలీ గాంధీలు ఎన్నో హామీలిచ్చారు. పింఛను రూ.2 వేలు ఉంటే కాంగ్రెసోళ్లు రూ.4 వేలు వేస్తామన్నారు. మేం రైతుబంధు రూ.10వేలు ఇస్తే.. రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ చెప్పింది. చదువుకునే విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామన్నారు. రూ.2 లక్షల రుణమాఫీని ఒక్క సంతకంతో రద్దు చేస్తామని చెప్పారు. కల్యాణలక్ష్మి పథకంలో రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తామన్నారు. ఇప్పటికీ పింఛన్లు పెరగలేదు, రుణమాఫీ పూర్తి కాలేదు. ఎన్నో మాటలు చెప్పి ప్రజలను ఏమార్చారు.

ఉచిత బస్సులు పెట్టి మహిళలు జుట్లు పట్టుకొని కొట్టుకునే పరిస్థితి తెచ్చారు. ప్రతి చెడు విషయానికి కేసీఆర్ కారణమని చెబుతున్నారు. మమ్మల్ని ఎవరూ నమ్మడం లేదు.. అప్పు పుడతలేదని దివాలా మాటలు మాట్లాడుతున్నారు. హామీల గురించి అడిగితే.. సంక్రాంతి, మార్చి అంటూ గడువులు చెబుతున్నారు. నా కళ్లముందే తెలంగాణ ఇలా అయిపోతుంటే దుఃఖం వస్తోంది. మళ్లీ కరెంట్ కోతలు, మోటార్లు కాలిపోయే రోజులు వచ్చాయి. కేసీఆర్ మంచిగా ఇచ్చిన కరెంట్‌కు ఇవాళ ఏమయిందని అడుగుతున్నాం. భూముల ధరలు ఎందుకు తగ్గాయి? నీళ్లు ఎక్కడికి పోయాయి? వడ్లు కొనే దిక్కులేదు.. కల్లాల్లో రైతులు ఏడుస్తున్నారు. 2014కు ముందున్న పరిస్థితులు మళ్లీ వచ్చాయి'' అని భారాస అధినేత కేసీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

**ఇకపై బయటకు వస్తా.. ప్రజలన తరపున పోరాడతా**

'' పాలన చేతకాక రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించారు. 8090శాతం పూర్తయిన ప్రాజెక్టులను పూర్తి చేయకుండా పక్కన పెట్టారు. పేద మహిళల కోసం తీసుకువచ్చిన కేసీఆర్ కిట్ పథకం కూడా బంద్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కొన్నాళ్లు సమయం ఇవ్వాలని ఇన్నాళ్లు బయటకు రాలేదు. ఇప్పటి నుంచి బయటకి వస్తా.. అందరి తరపున పోరాడతా. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి తెలివితో పని చేయాలి. ఎక్కడ పోగొట్టుకున్నామో మళ్లీ అక్కడే సాధించాలి. మాట్లాడితే భారాసపై నిందలు వేస్తున్నారు. భూములు అమ్మొచ్చు.. అభివృద్ధి చేయొచ్చు కానీ, ఏది అమ్మాలో విచక్షణ ఉండాలి. ఎక్కడైనా యూనివర్సిటీ భూములు అమ్ముతారా?'' అని కేసీఆర్ ప్రశ్నించారు.

**రాజీవ్ ఆరోగ్యశ్రీని కొనసాగించా**

''ఎవరు తెచ్చినా.. బాగున్న పథకాన్ని కొనసాగించాలని నేను ఆనాడే చెప్పాను. వైఎస్ఆర్ తీసుకొచ్చిన ఆరోగ్యశ్రీ పథకాన్ని నేను రద్దు చేయలేదు. పేరు మార్చకుండా ఆ పథకాన్ని కొనసాగించాను. ప్రభుత్వాన్ని సామాజిక మాధ్యమాల్లో ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వారిపై పోలీసులు కేసులు పెడుతున్నారు. పోలీసులకు చెబుతున్నా.. డైరీల్లో రాసుకోండి.. మళ్లీ వచ్చేది భారాస ప్రభుత్వమే. భారాస ప్రభుత్వాన్ని ఆపడం ఎవరి తరమూ కాదు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా..భారాస ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరు. కార్యకర్తలకు భారాస లీగల్ సెల్ అండగా ఉంటుంది. ఈ ప్రభుత్వం అన్ని విషయాల్లో విఫలమైంది. 2030శాతం కమీషన్లు తీసుకుంటూ సంచులు మోస్తోంది. అసెంబ్లీకి రావాలని నాకు సవాల్ విసురుతున్నారు. పిల్లలు అడిగితేనే చెప్పే దిక్కులేదు.. నేను కావాలా? కమీషన్ల గురించి అసెంబ్లీలో హరీశ్‌రావు ప్రశ్నిస్తే.. భుజాలు తడుముకుంటున్నారు.

**ఆపరేషన్ కగార్ ఆపేయాలి**

భాజపా వైఖరి అంతా భభ్రమానం..భజగోవిందం. శుష్క ప్రియాలు.. శూన్య హస్తాలు. ఆపరేషన్ కగార్ అనే పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో గిరిజనులు, యువతను ఊచకోత కోస్తున్నారు. చర్చలకు పిలవాలని నక్సలైట్లు కోరుతున్నారు. వాళ్ల విజ్ఞప్తి మేరకు నక్సలైట్లను చర్చలకు పిలవాలి. బలగాలు ఉన్నాయని అందర్నీ చంపుతూ వెళ్తే.. ప్రజాస్వామ్యం అనిపించుకోదు. ఆపరేషన్ కగార్ తక్షణమే నిలిపివేయండి. ఆపరేషన్ కగార్ ఆపాలని తీర్మానం చేసి దిల్లీకి పంపుదాం'' అని కేసీఆర్ అన్నారు.

# కాంగ్రెస్‌పై కేసీఆర్ విషం కక్కారు

(మొదటి పేజీ తరువాయి)



మా ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలకు అందుబాటులో ఉంది. ప్రజలకు కాంగ్రెస్ అందిస్తున్న మంచి పాలన గురించి తట్టుకోలేక కేసీఆర్ విషం కక్కారు. గతంలో వరి వేస్తే ఉరి అని చెప్పి.. కేసీఆర్ మాత్రం 150 ఎకరాల్లో వరి వేశారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు కేసీఆర్ మాట్లాడుతున్నారు. గత భారాస ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.82 వేల కోట్లు బకాయిలు పెట్టింది.

సర్పంచులకు కాంగ్రెస్ బకాయిలు పెట్టిందని కేసీఆర్ అంటున్నారు. మా ప్రభుత్వం వచ్చాక సర్పంచులే లేరు. మా ప్రభుత్వంలో సర్పంచులు ఒక్క రూపాయి పని కూడా చేయలేదు. అధికారంలోకి రావాలని కేసీఆర్ పగటికలలు కంటున్నారు. భారాస సభకు ఆటంకాలు సృష్టించామని కేసీఆర్ ఆరోపించారు. సభకు అసలు ఆటంకం సృష్టించలేదు.. మేం ఇబ్బంది పెట్టి ఉంటే సభ జరిగేదా? ఆ పార్టీ నేతలు అడిగినన్ని బస్సులను సభకు పంపాం. గత సీఎం పరిపాలన వల్ల ధనిక రాష్ట్రం అప్పులపాలైంది. యూనివర్సిటీ ఆస్తులు అమ్ముతున్నామని కేసీఆర్ ఆరోపించారు. అసలు యూనివర్సిటీ ఆస్తులను మేం ఎక్కడ విక్రయించాము? ఈ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి మాటను నెరవేరుస్తోంది. కేసీఆర్ తెచ్చిన ధరణిలో ఎన్ని కుంభకోణాలు జరిగాయో అందరికీ తెలుసు. 'ధరణి' గురించి కేసీఆర్ ఎందుకు ప్రస్తావించలేదు. ఈ ప్రభుత్వం పేదలకు ఇస్తున్న సన్నబియ్యం గురించి ఎందుకు మాట్లాడలేదు? కాళేశ్వరం ప్రాజెక్టు ప్రపంచంలో 8వ అద్భుతం అని చెప్పుకొన్నారు. కానీ, ఇవాళ ఆ ప్రాజెక్టు పనికిరాదని జాతీయ డ్యామ్ సేఫ్టీ కమిటీ నివేదిక ఇచ్చింది. ఏ అంశంపై ఎప్పుడు అసెంబ్లీ పెట్టమంటారో కేసీఆర్ చెప్పాలి. కేసీఆర్ చెప్పిన అంశంపై అసెంబ్లీ చర్చకు మేం సిద్ధం. భారాస వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని బీసీ నేతకు ఇవ్వాలి. దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని ఉద్యమం రోజుల్లో చెప్పారు. అది ఎలాగూ చేయలేదు.. కనీసం ప్రతిపక్ష నేత హోదాను అయినా దళితుడికి ఇవ్వొచ్చు కదా..! కేసీఆర్ పగటి కలలను తెలంగాణ ప్రజలు నిజం కానివ్వరు. ఆయన పడగొడితే పడిపోవడానికి ఇది బొమ్మరిల్లు కాదు. మళ్లీ సీఎం అవుతానని భ్రమపడుతూ.. ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారు'' అని పొంగులేటి అన్నారు.

**అధికారం పోయిందని అక్కసు: సీతక్క**

అధికారం పోయిందనే అక్కసును మాజీ సీఎం కేసీఆర్ వెళ్లగక్కారని మంత్రి సీతక్క విమర్శించారు. అధికారం పోయిన తర్వాత ఆయన కుటుంబంలో చీలికలు వస్తున్నాయని బాధపడుతున్నారు తప్ప.. ప్రజల కోసం కాదని అన్నారు. ''కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల్లోనే 59 వేల ఉద్యోగాలు ఇచ్చింది. పార్టీ రజతోత్సవ వేళ ఎవరైనా పార్టీ త్యాగాలు, గొప్పదనాలు చెప్పుకొంటారు. కానీ, కేసీఆర్ మాత్రం కాంగ్రెస్‌ను విమర్శించేందుకే సభ పెట్టారు. పేద మహిళల కోసం ఉచిత ఆర్టీసీ ప్రయాణం కల్పిస్తే.. వారిని అవమానిస్తున్నారు. కేసీఆర్ అంతదారుణంగా పోలీసు వ్యవస్థను ఇంకెవరూ వాడుకోలేదు. అధికారంలో ఉన్నన్ని రోజులూ పోలీసులను తన ఫామ్‌హౌజ్ వద్ద కాపలా ఉంచారు. ప్రజలు నిరసన తెలిపే అవకాశం లేకుండా ఇందిరాపార్క్ వద్ద ధర్నాచౌక్ మూసివేయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెరిపించిన ధర్నాచౌక్ వద్ద ఆయన కుమార్తె ధర్నాలు చేస్తున్నారు. అసెంబ్లీలో మాట్లాడే సమస్యలను ఉత్తికబుర్లని అవమానించారు. అలాంటి వ్యక్తికి మళ్లీ అసెంబ్లీలో అడుగు పెట్టే నైతిక హక్కు ఉందా?'' అని సీతక్క ప్రశ్నించారు.

**కేసీఆర్ గర్వం ఇంకా తగ్గలేదు: జూపల్లి**


ప్రజలు ఓడించి ప్రతిపక్షంలో కూర్చుబెట్టినా.. కేసీఆర్‌లో ఇంకా గర్వం తగ్గలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు వ్యాఖ్యానించారు. పార్టీ రజతోత్సవ వేదికపై కేసీఆర్ మినహా ఒక్క నేత అయినా మాట్లాడకుండా నిరంకుశంగా వ్యవహరించారని అన్నారు. భారాస నేతలు నిజాయితీపరులైతే.. ఆ పార్టీ ఖాతాలో రూ.వేల కోట్లు ఎలా ఉన్నాయని ప్రశ్నించారు. '' కాళేశ్వరం కార్పొరేషన్ ఎండీగా ఉన్న ఉద్యోగి దగ్గర ఇవాళ రూ.200 కోట్లు దొరికాయి. ఆయనే అంత సంపాదించారంటే.. కేసీఆర్ కుటుంబం ఇంకెంత దోచుకుందో అర్థం చేసుకోవాలి. దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పి ఇచ్చారా?పదేళ్లు ప్రైవేటు వ్యక్తి చేతిలో ఉన్న కంచ గచ్చిబౌలి భూములను ఎందుకు పట్టించుకోలేదు. బంగారు బాతులాంటి ఔటర్ రింగ్‌రోడ్డును 30 ఏళ్లకు అప్పనంగా అమ్మలేదా? ఏ తప్పూ చేయకపోతే ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితులు విదేశాల్లో ఎందుకు దాక్కున్నారు?'' అని జూపల్లి ప్రశ్నించారు.

**కేసీఆర్ అవకాశవాది: పొన్నం ప్రభాకర్**

కేసీఆర్ అవకాశవాదిలా మాట్లాడారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ''సోనియా గాంధీ వల్లే తెలంగాణ వచ్చిందని కేసీఆర్ అనలేదా?ఇవాళ విలన్ అంటున్నారు. తెలంగాణ కోసం ప్రాణాలు అర్పించిన వారికి ఆ సభా వేదికపై ఎందుకు నివాళి అర్పించలేదు. పార్టీ పదవులను బీసీ, ఎస్సీ, ఎస్టీలకు ఎవరికైనా ఇచ్చారా'' అని నిలదీశారు.

# సీఎం రేవంత్‌తో శాంతి చర్చల కమిటీ నేతల సమావేశం

(మొదటి పేజీ తరువాయి)



'నక్సలిజాన్ని మా ప్రభుత్వం సామాజిక కోణంలో మాత్రమే చూస్తుంది తప్ప శాంతి భద్రతల అంశంగా పరిగణించదు. గతంలో నక్సలైట్ల తో చర్చలు జరిపిన అనుభవం సీనియర్ నేత జానారెడ్డికి ఉంది.ఈ అంశంపై సీనియర్ నేత జానారెడ్డి సలహాలు , సూచనలు తీసుకుంటాం. మంత్రులతో చర్చించి ఒక నిర్ణయాన్ని తీసుకుంటాం' అని తెలిపారు.

కాగా, తెలంగాణఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్టల్లో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా భద్రతా బలగాలు ఆపరేషన్ కొనసాగుతోంది. ఐదో రోజు కూంబింగ్‌లో భాగంగా మావోయిస్టులకు భారీ షాక్ తగిలింది.

# ఎప్పుడైనా సరే రెడీ..



(మొదటి పేజీ తరువాయి)

ఆ మేరకు చర్యలను వేగవంతం చేసింది. అయితే పాకిస్తాన్ మాత్రం సరిహద్దుల్లో కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. భారత ఆర్మీని రెచ్చగొట్టే ప్రయత్నంలో భాగంగా ఎల్ఓసీ(నియంత్రణ రేఖ) వెంబడి పాకిస్తాన్ పదేపదే కాల్పుల విరమణ ఉల్లంఘనలకు పాల్పడుతోంది.

ఈ దాడులను భారత్ సమర్ధవంతంగా తిప్పికొడుతూ పాకిస్తాన్ దుశ్చర్యలపై ఓ కన్నేసి ఉంచింది. ఈ క్రమంలోనే పాకిస్తాన్ ఇంకా ఏమైనా హద్దు మీరితే గట్టిగానే బదులివ్వడానికి భారత్ సిద్ధమైంది. దీనిలో భాగంగా భారత యుద్ధనౌకలు అరేబియా సముద్రంలో సైనిక విన్యాసాలను ఆరంభించాయి. ఏ క్షణంలోనైనా పాకిస్తాన్ నుంచి ముప్పు పొంచి ఉందన్న క్రమంలో నేవీ సిద్ధమైంది. లాంగ్ రేంజ్ కచ్చితమైన దాడులకు భారత్ సిద్ధంగా ఉన్నట్లు నేవీ స్పష్టం చేసింది. దేశ ప్రయోజనాలను కాపాడటానికి తాము యుద్ధానికి సిద్ధంగా ఉన్నామని ఇండియన్ నేవీ.. పాకిస్తాన్ కు హెచ్చరికలు పంపింది. ఎనీటైమ్.. ఎనీవేర్.. ఎనీహౌ అంటూ నేవీ తన ' ఎక్స్' ద్వారా ఒక మెస్సేజ్ ను పంపింది. గత మంగళవారం (ఏప్రిల్ 22వ తేదీ) పహల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిలో టూరిస్టులు 26మంది వరకూ ప్రాణాలు కోల్పోయారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. పాకిస్తాన్ సహకారంతోనే ఉగ్రదాడులు జరుగుతున్నాయని పసిగట్టిన భారత్.. అందుకు అనుగుణంగా స్ట్రాంగ్ మెస్సేజ్ పంపింది. సింధూ జలాలను నిలిపివేతతో పాటు పాకిస్తాన్ జాతీయులు దేశం నుంచి విడిచి వెళ్లిపోవాలని ఆంక్షలు విధించింది.

# కర్రెగుట్టల్లో భారీ సొరంగం..





(మొదటి పేజీ తరువాయి)

కొన్ని నెలల పాటు మావోయిస్టులు ఈ సొరంగంలోనే ఉన్నట్లు భద్రతా బలగాలు గుర్తించారు. కొండల్లో పెద్ద సంఖ్యలో ఉన్న మావోయిస్టులు కూడా డీహైడ్రేషన్‌కు గురయ్యారని, వారి పరిస్థితి విషమంగా మారుతోందని భద్రతా బలగాలు అనుమానిస్తున్నాయి.

మరోవైపు నిరంతరం జరుగుతున్న ఈ ఆపరేషన్ కారణంగా మావోయిస్టులు ఇప్పుడు ఆహారం కోసం ఇబ్బందులు పడుతూ ఉండొచ్చని చెబుతున్నారు. మావోయిస్టులు ప్రస్తుతం దాక్కున్న అన్ని కొండలను చుట్టుముట్టే వరకు ఈ ఆపరేషన్ కొనసాగించాలని ప్రభుత్వం, భద్రతా బలగాలు భావిస్తున్నాయి. ములుగు జిల్లా వెంకటాపురం సరిహద్దును కేంద్రంగా చేసుకొని ఛత్తీస్‌గఢ్‌లోని కొత్తపల్లి మొదలుకొని భీమారంపాడు, కస్తూరిపాడు, చినఉట్లపల్లి, పెదఉట్లపల్లి, పూజారికాంకేర్, గుంజపర్తి, నంబి, ఎలిమిడి, నడిపల్లి, గల్గంలో ప్రధానంగా ఆపరేషన్ కొనసాగుతోంది. రుద్రారం వరకు 90 కి.మీ. పొడవున ఉన్న కర్రెగుట్టలను తమ అధీనంలోకి తెచ్చుకునేందుకు వేల సంఖ్యలో బలగాలు జల్లెడ పడుతూ కొండలపైకి చేరుకునే ప్రయత్నం చేస్తున్నాయి. అతి కష్టం మీద శనివారం సాయంత్రం కొంతమేరకు ఎక్కగలిగిన బలగాలు మావోయిస్టులు తలదాచుకున్నట్లు భావిస్తున్న సొరంగాన్ని గుర్తించాయి. ఇప్పటి వరకు ముగ్గురు మహిళా మావోయిస్టుల మృతదేహాలను, ఆయుధాలను, పెద్దఎత్తున పేలుడు సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. శనివారం భారీ సంఖ్యలో మావోయిస్టులు మృతిచెందినట్లుగా విస్తృత ప్రచారం సాగినప్పటికీ అధికారులు నిర్ధరించలేదు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





## పల్లె పల్లెనా గులాబీ జెండాలే..
# ప్రతిదారి గులాబీ మయమైంది

- ఘనంగా 25 వ బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం.
- 25 వసంతాల బీఆర్ఎస్ పార్టీ రజోత్సవం.
- వరంగల్ సభకు బయలుదేరిన మండలంలోని ఆయా గ్రామాల బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు.

**మెదక్ బ్యూరో/ టేక్మాల్ తెలంగాణ ము-చ్చట్లు:** మండల కేంద్రంలో ఆదివారం బిఅర్ఎస్ పార్టీ రజతోత్సవ సందర్భంగా టేక్మాల్ బస్టాండ్ ఆవరణంలో పార్టీ జెండాను బిఅర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప బిఅర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. మండల ప్రజలందరికీ బిఆర్ఎస్ కుటుంబ సభ్యులకు, ఉద్యమకారులకు, కార్యకర్తలకు నాయకులకు అందరికీ బిఆర్ఎస్ పార్టీ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప మాట్లాడుతూ తెలంగాణ రాష్ట సాధన కోసం ఎంతో మంది అమరులు అయ్యారని వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ప్రజాస్వామ్య ప్రక్రియ ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు జరగాలని ఉద్యమ నేత రథసారధి కేసీఆర్ బిఆర్ఎస్ పార్టీని స్థాపించారు. ఎన్నో ఏళ్ల పోరాటంతో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం లక్ష్యం నెరవేరింది అన్నారు. రాష్ట్రం సిద్ధించాక కేసీఆర్ గారి నాయకత్వంలో అభివృద్ధి సాధ్యమైంది, 10 ఏళ్లలో బిఆర్ఎస్ ఎన్నో సమస్యలను పరిష్కరించింది. ప్రజల గుండెల్లో బిఆర్ఎస్ నిలిచిపోయిందన్నారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చి రాష్ట్రాన్ని ముందు వరుసలో నిలబెట్టారన్నారు. మోసపూరిత హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీనీ కబంధ అస్తల నుంచి ప్రజలకు విముక్తి కల్పించడం కోసం బిఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఎండగడుతూ బిఅర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిఆర్ఎస్ పార్టీ నాయకులు నాయకులు, కమ్మరి సిద్ధయ్య, నాయికోటీ భాస్కర్, చింతా రవి, బోరంఛ సాయిలు, యంఏ సలీం, సురేందర్ రెడ్డి, హన్మగౌడ్, మతిన్, మాణిక్యం, సత్యం, సుధాకర్, బాలకృష్ణ, కిషన్ ,దుర్గయ్య, ప్రభాకర్, సంతోష్, చంద్రశేఖర్, రాములు, సాయిలు, అల్లావుద్దీన్, టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వేములవాడ రాజన్న ఆలయ విస్తరణకు శ్రీకారం

## శృంగేరి పీఠాధిపతి అనుమతితో త్వరలో ప్రారంభం



**వేములవాడ, తెలంగాణ ముచ్చట్లు:**
వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ విస్తరణకు శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి తీర్థ స్వామి అనుమతితో శ్రీకారం చుట్టనున్నారు. దీనిని ప్రభుత్వ విప్, వేములవాడ నియోజకవర్గ శాసన సభ్యుడు ఆది శ్రీనివాస్ వెల్లడించారు.

ఆదివారం ఆయనతో పాటు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్ లు కలిసి శృంగేరి పీఠాధిపతిని మర్యాదపూర్వకంగా కలిసారు. ఆలయ విస్తరణపై విపులంగా చర్చించారు. ఆలయ నమూనాలను పరిశీలించిన పీఠాధిపతి, అభివృద్ధి పనులు పురోగమించేందుకు అనుమతిస్తూ సూచనలు చేశారు.

ఇందుకు ముందు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, సీఎంఓ ఓఎస్డీ శ్రీనివాసులు, ఆది శ్రీనివాస్ రెండు సార్లు శృంగేరి పీఠాన్ని సందర్శించి అనుమతులు తీసుకున్నారు. అనంతరం విజయవాడలో మరోసారి దేవాదాయ శాఖ అధికారులతో కలిసి పీఠాధిపతిని కలసి ఆలయ అభివృద్ధి ప్రతిపాదనలపై సమగ్ర చర్చ జరిపారు.

గత నవంబర్ 20న వేములవాడ ఆలయ అభివృద్ధి విస్తరణ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది. దేవాదాయ శాఖ మంత్రులు కొండ సురేఖా, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు సమక్షంలో కార్యక్రమం జరిగింది. ప్రస్తుతం ఆలయ విస్తరణకు సంబంధించిన టెండర్లు, నమూనాలు తుది దశలో ఉన్నాయి. ప్రతి అభివృద్ధి పనిని క్షుణ్ణంగా పరిశీలించి, పీఠాధిపతి ఆమోదంతో ముందుకు సాగనున్నారు.విస్తరణ పనులు కొనసాగినంతకాలం, శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి ప్రతినిత్యం జరిపే చతుస్కాల పూజలు, మహానివేదన, నిత్య పూజా కార్యక్రమాలు అర్చక బృందం ద్వారా యథావిధిగా ఏకాంతంగా నిర్వహించబడతాయి. భక్తుల సౌకర్యార్థం, భీమేశ్వర ఆలయంలో తాత్కాలికంగా ఆర్జిత సేవలు కొనసాగించనున్నారు.

ఈ కార్యక్రమంలో ఎండోమెంట్స్ సలహాదారు గోవిందా హరి, ఆర్&బి సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఆలయ ఈవో వినోద్ రెడ్డి, ఆర్కిటెక్ట్ సూర్యనారాయణ మూర్తి, అర్చకులు శరత్, సురేష్, శృంగేరి పీఠం తెలంగాణ బాధ్యులు రాధాకృష్ణ శర్మ, ఏఈ రామకిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ మనసంతా విషంతో నిండిపోయింది

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** భారాస అధినేత కేసీఆర్ మనసంతా విషంతో నిండిపోయిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయన ప్రసంగం మొత్తంలో కాంగ్రెస్‌ను విలన్‌లా చిత్రీకరించడం తప్ప ఇంకేమీ లేదని విమర్శించారు. మంచి సలహాలు, సూచనలు ఇస్తారేమోనని కేసీఆర్ ప్రసంగం విన్నామని, అందులో ఏమీ లేదని ఎద్దేవా చేశారు. భారాస రజతోత్సవాల సందర్భంగా ఎల్కతుర్తిలో కేసీఆర్ చేసిన ప్రసంగంపై పొంగులేటి మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ తీరును తప్పుబట్టారు. ''గత సీఎం పరిపాలన వల్ల ధనిక రాష్ట్రం అప్పులపాలైంది. అప్పులున్నా.. ప్రజలకు సంక్షేమం అందిస్తున్నాం. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్‌ను విలన్‌గా చిత్రీకరిస్తున్నారా? కడుపంతా విషం నింపుకొని కేసీఆర్ మాట్లాడటం బాధ కలిగించింది. రెండుసార్లు భారాసకు అధికారం ఇస్తే.. ఎలా కొల్లగొట్టారో ప్రజలు గమనించారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి.. మంచి సలహాలు ఇస్తారని ఎదురు చూశాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఐదారు పర్యాయాలు అసెంబ్లీ జరిగింది. కేవలం రెండుసార్లే కేసీఆర్ వచ్చారు. అధికారంలో ఉన్నప్పుడు సచివాలయానికి కూడా కేసీఆర్ వెళ్లలేదు. కేసీఆర్ దొర మాదిరిగా పరిపాలిస్తే.. మా ప్రభుత్వం ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలకు అందుబాటులో ఉంది. ప్రజలకు కాంగ్రెస్ అందిస్తున్న మంచి పాలన గురించి తట్టుకోలేక కేసీఆర్ విషం కక్కారు. గతంలో వరి వేస్తే ఉరి అని చెప్పి.. కేసీఆర్ మాత్రం 150 ఎకరాల్లో వరి వేశారు. దెయ్యాలు వేదాలు వల్లించినట్లు కేసీఆర్ మాట్లాడుతున్నారు. గత భారాస ప్రభుత్వం కాంట్రాక్టర్లకు రూ.82 వేల కోట్లు బకాయిలు పెట్టింది. సర్పంచులకు కాంగ్రెస్ బకాయిలు పెట్టిందని కేసీఆర్ అంటున్నారు. మా ప్రభుత్వం వచ్చాక సర్పంచులే లేరు. మా ప్రభుత్వంలో సర్పంచులు ఒక్క రూపాయి పని కూడా చేయలేదు. అధికారంలోకి రావాలని కేసీఆర్ పగటికలలు కంటున్నారు. భారాస సభకు ఆటంకాలు సృష్టించామని కేసీఆర్ ఆరోపించారు. సభకు అసలు ఆటంకం సృష్టించలేదు.. మేం ఇబ్బంది పెట్టి ఉంటే సభ జరిగేదా? ఆ పార్టీ నేతలు అడిగినన్ని బస్సులను సభకు పంపాం. గత సీఎం పరిపాలన వల్ల ధనిక రాష్ట్రం అప్పులపాలైంది'' అని శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు.

# కొత్త సీసాలో పాత సారా లాగా కెసిఆర్ స్పీచ్

## కేసీఆర్ వ్యాఖ్యలకు ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్ కౌంటర్



**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు ఎమ్మెల్సీ డాక్టర్ అద్దంకి దయాకర్ ఘాటుగా స్పందించారు. "కేసీఆర్ స్పీచ్ కొత్త సీసాలో పాత సారా లాగాఉసూరుమనిపించింది. స్వయంస్తుతి, పరనింద తప్ప కొత్తదనం ఏమి లేదు," అని ఆయన విమర్శించారు.అద్దంకి దయాకర్ మాట్లాడుతూ, "రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ఎక్కడ ఉన్నారు, మీరు ఎక్కడ ఉన్నారు అన్న విషయాన్ని మీరే ఆలోచించాలి. తెలంగాణ ప్రజలు ఇప్పుడు రెచ్చిపోవడానికి సిద్ధంగా లేరు. నిన్న భారత్ సమ్మిట్‌లో 'హైదరాబాద్ రిజల్యూషన్'కు వచ్చిన స్పందన చూసి మీరు తడబడ్డారు. రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిని అంతర్జాతీయంగా ప్రశంసిస్తుంటే మీకూ, మీ నాయకత్వానికీ అసూయ తప్ప కనిపించడంలేదు," అని వ్యాఖ్యానించారు. "మీ స్పీచ్ కోసం ఎడ్ల బండ్లు తిరగబెట్టిన మీ పార్టీ నాయకుల పతనం స్పష్టంగా కనిపిస్తోంది. మీరు రాష్ట్రాన్ని ఆర్థిక విధ్వంసం చేసి ముంచిన సత్యాన్ని తెలంగాణ ప్రజలు మరచిపోలేదు. ఏడు లక్షల కోట్లు అప్పుచేసిన విషయాన్ని మీరే మర్చిపోయారు కాని ప్రజలు మరువలేదు," అని మండిపడ్డారు. "రాష్ట్రాన్ని ఓ గతిపాలుగా మార్చిన తర్వాత, ఇప్పుడు సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని సంరక్షిస్తున్నాడు. మేము రైతు ఋణమాఫీ, ఉచిత కరెంట్, ఉచిత బస్, ఉచిత గ్యాస్ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నాము. ఇవి మీ కళ్ళకు కనిపించట్లేదా?" అని ప్రశ్నించారు.

అద్దంకి దయాకర్ సవాల్ చేస్తూ, "మీకు ధైర్యం ఉంటే ఉచిత బస్, ఉచిత కరెంట్, 500 రూపాయలకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత కరెంట్ పై బహిరంగంగా రెజల్యూషన్ చేయండి," అని చెప్పారు. "బీసీలకు రాజ్యాంగ హక్కులు కల్పించేందుకు బీసీ బిల్లు తెచ్చాము. ఎస్సీల వర్గీకరణ కోసం కృషి కొనసాగుతోంది. ఇప్పటి వరకు ఎవరూ ఇవ్వని విధంగా భారతదేశ చరిత్రలో తొలిసారి సన్నబియ్యం అందిస్తున్నాం," అని చెప్పారు. "52 వేల ఉద్యోగాలు భర్తీ చేశాము, ఇంకొన్ని నెలల్లో 30 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేయబోతున్నాం. మీ సోషల్ మీడియా వాదనలతో కాదు, ప్రజల గుండెల గమనంతో మేము ముందుకు సాగుతున్నాం," అని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు.

"చట్టసభల్లో బీసీల రిజర్వేషన్ల కోసం రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి పోరాడుతున్నారు. మీ పార్టీ ఎలా నిద్రపోయిందో ప్రజలకు తెలుసు," అని అన్నారు.

"తెలంగాణ ప్రజల అవసరాల కోసం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు అహర్నిశలు శ్రమిస్తున్నారు. కానీ మీ పార్టీని బ్రతికించుకోవడానికి మీరు బీజేపీని తిట్టడమే మిగిలింది," అని దయాకర్ విమర్శించారు.



# తాటికాయలలో ఘనంగా బీఆర్ఎస్ 25 వసంతాల వేడుక

- బీఆర్ఎస్ గులాబీ జెండా ఆవిష్కరణ
- అనంతరం సభలో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు



**ధర్మసాగర్, తెలంగాణ ముచ్చట్లు:** భారత రాష్ట్ర సమితి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్,మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆదేశాల మేరకు హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం తాటికాయల గ్రామంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు వల్లాల నర్సయ్య గ్రామ పార్టీ శ్రేణుల సమక్షంలో గులాబీ జెండా ఆవిష్కరించారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో బహిరంగ సభకు తరలివెళ్లారు.

ఈ సందర్భంగా గ్రామ శాఖ అధ్యక్షుడు వల్లాల నర్సయ్య, మాజీ ఎంపీటీసీ ననుబాల సోమక్క చంద్రమౌళి మాట్లాడుతూ, "తెలంగాణ రాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన బీఆర్ఎస్ పార్టీ పోరాటం చరిత్రలో నిలిచిపోయింది. 25 ఏళ్ల బృహత్తర ప్రయాణంలో ప్రతి కార్యకర్త పాత్ర అపూర్వం. గ్రామస్థులు చూపిస్తున్న మద్దతు వల్ల పార్టీ బలోపేతం మరింత వేగంగా కొనసాగుతోంది. రాబోయే రోజుల్లో ప్రజల సంక్షేమమే మా లక్ష్యంగా ముందుకు సాగుతాం," అని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి బొల్లెపాక సంపత్, సీనియర్ నాయకులు ఎర్ర అశోక్, పెసరు సంపత్, పట్ల మీస రాజయ్య,ఎర్ర వెంకట స్వామి, కనుకటి రవీందర్,పెసరు సదయ్య తదితరులు పాల్గొన్నారు.



# పద్మశ్రీ మందకృష్ణ మాదిగ సన్మాన సభను విజయవంతం చేయండి

- ఎమ్మార్పీఎస్ చిల్పూర్ మండల ఇంచార్జ్ గంగారపు శ్రీనివాస్ మాదిగ
- ఎమ్మార్పీఎస్ మండల నాయకులు మట్టెడ అనిల్ మాదిగ ఆధ్వర్యంలో సమావేశం

**చిల్పూర్, తెలంగాణ ముచ్చట్లు:** చిల్పూర్ మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి అనుబంధ విభాగాల ముఖ్య కార్యకర్తల సమావేశం ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జి గంగారపు శ్రీనివాస్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "మూడేళ్ల దశాబ్దాలుగా అలుపెరగని సామాజిక ఉద్యమాన్ని నడిపించి, వర్గీకరణ విజయాన్ని సాధించి, పీడిత వర్గాల హక్కులు సాధించిన మహనీయుడు మందకృష్ణ మాదిగ. జాతి ఆత్మగౌరవానికి, ఉద్యమ చైతన్యానికి చిరస్మరణీయ ప్రతీక అయిన ఆయనకు పద్మశ్రీ పురస్కారం లభించడం గర్వకారణం. అలాగే వర్గీకరణ నెరవేరడం పీడిత వర్గాల దీర్ఘకాల ఆకాంక్ష నెరవేరిన ఘట్టం," అన్నారు. "ఈ సందర్భంగా మే నెల 2వ వారంలో స్టేషన్ గణపూర్ లో జరుగనున్న మందకృష్ణ మాదిగ సన్మాన సభను ఘనంగా విజయవంతం చేయాలి. చిల్పూర్ మండల పరిధిలో ప్రతి గ్రామాన్నీ, ప్రతి హృదయాన్నీ తట్టి లేపేలా, అన్ని రాజకీయ పక్షాలను, మాదిగ జాతి నాయకులను, ఉద్యమ సంఘాలను ఐక్యపరచి, భారీగా ఈ సభను విజయవంతం చేయాలని" ఆయన పిలుపునిచ్చారు. "మన వర్గాల భవిష్యత్తు జాతి చైతన్యంపైనే ఆధారపడి ఉంది. అందుకే ప్రతి ఒక్కరు కృషి చేసి, మన అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవాలని" గంగారపు శ్రీనివాస్ మాదిగ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆరూరి ప్రదీప్ కుమార్ (మాజీ సర్పంచ్), కురుసపల్లి శేఖర్, ఆరూరి అశోక్, ఆరూరి బాలస్వామి, ఆరూరి సుకేందర్, పాశం ప్రణయ్, చిట్యాల శ్రీకాంత్, మట్టెడ నవీన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



## పహల్గాం దాడిని ఖండిస్తూ మల్కాపూర్ యూత్,
# అఖిలపక్షం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

## అమాయక పర్యాటకుల మృతికి కోవొత్తులతో నివాళి

**చిల్పూర్, తెలంగాణ ముచ్చట్లు:**
జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో అమాయక పర్యాటకులపై ముష్కరులు నిర్వహించిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ జనగాం జిల్లా చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామ యూత్ మరియు అఖిలపక్షం ఆధ్వర్యంలో కోవొత్తులతో మౌన ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో భారీగా యువతీ యువకులు, గ్రామస్తులు ర్యాలీలో పాల్గొని అమాయకుల మృతికి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కేశిరెడ్డి లక్ష్మారెడ్డి, తోకల సంపత్ రెడ్డి మాట్లాడుతూ, "అమాయక పర్యాటకులపై ముష్కరులు చేయించిన అఘాయిత్యం మానవత్వానికి చెరసి. ఇటువంటి దాడులు దేశ ఐక్యతను, సామరస్యాన్ని భంగం చేయలేవు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాం. దేశ భద్రత కోసం ప్రతి పౌరుడూ మద్దతుగా నిలవాలి," అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కేశిరెడ్డి లక్ష్మారెడ్డి, తోకల సంపత్ రెడ్డి, ఉరడి సతీష్, దొరమ్ శ్రీనివాస్, చొప్పరి అజయ్, కుమార్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. యూత్ సభ్యులు కూడా పెద్దఎత్తున పాల్గొని సామూహికంగా మౌనం పాటించారు. ర్యాలీ చివర్లో దేశ భద్రతా బలగాలకు మద్దతుగా నినాదాలు చేయడం జరిగింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# వరంగల్ రజతోత్సవ సభకు తరలి వెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు

- బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం
- మళ్లీ గులాబీ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారు
- పెద్దమందడి మాజీ జెడ్పీటీసి రఘుపతి రెడ్డి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:** పెద్ద మందడి మండలం వెల్టూర్ గ్రామం నుండి మాజీ జడ్పీటిసి రఘుపతి రెడ్డి ఆధ్వర్యంలో వరంగల్ బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా తరలి వెళ్లారు. ఆదివారం ఉదయం గ్రామ అధ్యక్షుడు మల్లక్ సురేష్ కుమార్ బీఆర్ఎస్ జెండాను ఎగరవేసి బీఆర్ఎస్ నాయకులు వరంగల్ సభకు తరలి వెళ్లడం జరిగింది. ఈ సందర్భంగా పెద్దమందడి మాజీ జెడ్పీటిసి రఘుపతి రెడ్డి మాట్లాడుతూ... మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆదేశం మేరకు పెద్దమందడి మండలం నుండి దాదాపు 1000 మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పార్టీ అభిమానులు సభకు వెళుతున్నట్టు ఆయన తెలిపారు.కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలను, వైఫల్యాలను కెసిఆర్ ఈ సభలో ఎండగట్టబోతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లో ఆరు గ్యారెంటీల అమలకు నోచుకోలేదని కెసిఆర్ సభలో ప్రభుత్వాన్ని ప్రశ్నించబోతున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీగా, ఉద్యమ పార్టీగా 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో ప్రజలందరూ బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ఆధ్వర్యంలో రాబోయే స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటిసి రఘుపతి రెడ్డి, గ్రామ అధ్యక్షుడు మల్లక్ సురేష్ కుమార్, గ్రామ రైతుబంధు అధ్యక్షులు రఘువరన్ రెడ్డి, మాజీ ఎఎంసి మాజీ డైరెక్టర్ ఖజా హుస్సేన్, సీనియర్ నాయకులు చిత్తూరు కృష్ణారెడ్డి, సాంబ యాదయ్య, అశోక్ (చిట్టి), యాదయ్య, కుమార్, పార్టీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఉగ్రవాద దాడులను ఖండించిన నగర కాంగ్రెస్ కమిటీ

- మృతులకు ఘన నివాళి
- కొవ్వొత్తులతో ర్యాలీ

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా నగరంలో 9,10,11,12,13 వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుల్ల ఆద్వర్యంలో రోటరీ నగర్ నుండి ఇల్లందు క్రాస్ రోడ్డు వరకూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహమ్మద్ జావేద్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య పాల్గొని మాట్లాడుతూ... ఉగ్రమూకల దాడిలో అసువులు బాసిన మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని తెలియజేశారు.వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్థానమని చేస్తున్నట్లు అన్నారు.ఈ ఘటనకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని అమాయక ప్రజలను పొట్టపెట్టుకున్న ఉగ్రవాద సంస్థలను నిర్మూలన చేయాలని డిమాండ్ చేశారు.ఉగ్రదాడి బాధితులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉండి దాడికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సమయంలో దేశప్రజలు ఒక్కటై బాధిత కుటుంబాలకు నిలబడాలని కోరారు. 10వ డివిజన్ కార్పొరేటర్ చావ నారాయణరావు తొమ్మిదో డివిజన్ కార్పొరేటర్ 9 డివిజన్ కార్పొరేటర్ నాగుల్ మీరా 9వ డివిజన్ అధ్యక్షులు దొడ్డ ప్రవీణ్ 13వ డివిజన్ అధ్యక్షులు ఏలూరు రవికుమార్ 12వ రోజున అధ్యక్షులు దండా ప్రసాద్ 11వ రఅధ్యక్షులు ఫరీద్ ఖాద్రి బాబా భాష సుగుణ సిపిఐ పార్టీ నుంచి నాన్న బాల రామకృష్ణ జాకీర్ భాష జగదీష్ సుగుణ తదితరులు పాల్గొన్నారు.

# యరగర్ల పిచ్చయ్య భౌతిక కాయానికి నివాళులర్పించిన యాదవ నాయకులు

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ యరగర్ల హనుమంతరావు తండ్రిగారైన యరగర్ల పిచ్చయ్య శనివారం సాయంత్రం వారి నివాసం వివి పాలెంలో అనారోగ్యంతో చనిపోయారు. అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవ అధ్యక్షులు మేకల మల్లిబాబు యాదవ్ జిల్లా గౌరవ అధ్యక్షులు చిలకల వెంకట నరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షులు చిత్తారు సింహాద్రి యాదవ్ మరియు యాదవ సంఘం నాయకులు పిచ్చయ్య గారి భౌతిక దేహానికి పూల మాలవేసి శ్రద్ధాంజలి ఘటించి నివాళులర్పించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుమారులు హనుమంతరావు నాగరాజు, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మనకు జన్మనిచ్చి, తమ జీవితాన్ని ధారపోసి మనలను ఉన్నత స్థితికి



చేర్చిన కన్న తండ్రి మరణం తన సంతానానికి ఎంతో వేదన మిగిలిస్తుందని మల్లి బాబు యాదవ్ పిచ్చయ్య మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ ఫతే మహమ్మద్,తోట రామారావు, వాగదాని కోటేశ్వరరావు, శెట్టి రంగారావు, చేతుల నాగేశ్వరావు, మొరిమేకల కోటయ్య పంకు మురళి, పంకు కిషోర్,పంకు అప్పారావు, పంకు నరసింహారావు,పరిటాల భద్రయ్య, వీరబాబు, పల్లపు భద్రం,లింగయ్య, తదితర యాదవ సంఘం ప్రతినిధులు నాయకులు పాల్గొన్నారు

# మార్షల్ ఆర్ట్స్‌లో ప్రపంచ రికార్డు సాధించిన బొల్లెపాక నిహాల్

### అత్యధిక ఎయిర్ పంచెస్ (45,808) కొట్టిన నిహాల్

### హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు



**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం లోని తాటికాయల గ్రామానికి చెందిన నిహాల్ బొల్లేపాక తన అసాధారణ ప్రతిభతో అంతర్జాతీయ స్థాయిలో పేరు గడించాడు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ఇండోనేపాల్ ఇంటర్నేషనల్ ఆల్ స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో అత్యధిక ఎయిర్ పంచెస్ (45,808) కొట్టి హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు.

ఈ ఘనతను సాధించడంలో అమీకల్ స్పోర్ట్స్ అకాడమీ మరియు విజన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ప్రోత్సాహం మరుపరానిది. మొత్తం 409 మంది పాల్గొన్న ఈ ప్రత్యేక కార్యక్రమంలో నిహాల్ తన అసాధారణమైన శ్రమ, పట్టుదలతో అందరినీ ఆకట్టు



కున్నాడు.

నిహాల్ 'ఛాంపియన్స్ షోటోకాన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ' (CSMA)లో శిక్షణ పొందుతున్నాడు. ఈ అకాడమీ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ బి. రవికుమార్ గౌడ్ నిహాల్‌కు మార్గదర్శకుడిగా నిలిచారు. చిన్న వయసులోనే అంతటి ఘనతను సాధించిన నిహాల్ తాటికాయల గ్రామానికి గర్వకారణంగా మారాడు.




సర్టిఫికెట్, మెడల్, ట్రోఫీతో మెరిసిపోతున్న నిహాల్ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్నాయి. అతడి విజయాన్ని కుటుంబ సభ్యులు, గురువులు, గ్రామస్తులు అభినందిస్తూ గర్వపడుతున్నారు. భవిష్యత్తులోనూ నిహాల్ మరింత ఉన్నత స్థాయిలో దేశానికి పేరు తెచ్చేలా మారాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు.నిహాల్ ప్రస్తుతం హైదరాబాద్ నగారంలోని సెయింట్ మేరీస్ బెథానీ కాన్వెంట్ విద్యాలయలో 6వ తరగతి చదువుతున్నాడు.



# మహబూబాబాద్ టౌన్ సిఐ 'పెండ్యాల దేవేందర్' కు రివార్డు

- డీజీపీ చేతులు మీదుగా రివార్డు అందుకున్న పెండ్యాల దేవేందర్.

**పర్వతగిరి,తెలంగాణ ముచ్చట్లు:** వరంగల్ టాస్క్ ఫోర్స్ విభాగంలో విధులు నిర్వహించిన సీ.ఐ పెండ్యాల దేవేందర్ కు మాదకద్రవ్యాలు నిర్మూలనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర డిజిపి చేతుల మీదుగా రివార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సిఐ పెండ్యాల దేవేందర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు నిర్మూలనలో భాగంగా నాకు అవార్డు రావడం అవార్డుని తెలంగాణ రాష్ట్ర డిజిపి చేతుల మీద నుంచి అందుకోవటం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.అలాగే యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా గంజాయి మత్తు పదార్థాలకు దూరంగా ఉండి వారి భవిష్యత్తుకు బాటలు వేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తల్లిదండ్రులు మీ మీద పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పెండ్యాల దేవేందర్ యువతకు సందేశం ఇచ్చారు. సి.ఐ పెండ్యాల దేవేందర్ మాదకద్రవ్యాల నిర్మూలన రివార్డు అందుకున్నందుకు పలువురు ఉన్నత అధికారులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.



# వంగాలపల్లిలో ఘనంగా బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలు

- బిఆర్ఎస్ జెండా ఆవిష్కరణ
- అనంతరం సభకు తరలివెళ్లిన బిఆర్ఎస్ శ్రేణులు

**చిల్పూర్,తెలంగాణ ముచ్చట్లు:**

భారత రాష్ట్ర సమితి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జనగామ జిల్లా చిల్పూర్ మండలం వంగాలపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు గ్రామ ప్రజలతో కలిసి గులాబీ జెండా ఆవిష్కరించారు. అనంతరం బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో బహిరంగ సభకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చిట్యాల దయాకర్, గ్రామ ఇంచార్జ్ ఆరూరి రవిచందర్ మాట్లాడుతూ ,"తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి బీఆర్ఎస్ పార్టీ చేసిన పోరాటం చిరస్మరణీయం. కష్టాల్లో కడబడిన తెలంగాణ ప్రజలకు భరోసా ఇచ్చిన పార్టీ మన బీఆర్ఎస్. గత 25 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త విశేషంగా కృషి చేశాడు. గ్రామస్థులు చూపిస్తున్న మద్దతు వల్ల బీఆర్ఎస్ మరింత బలంగా ముందుకు సాగుతోంది. రాబోయే రోజుల్లో కూడా పార్టీ ఆవేశాలు మరింత విస్తరించి ప్రజల సంక్షేమానికి పాటుపడుతుంది," అని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ ఇంచార్జ్ ఆరూరి రవిచందర్,నూనె యాదగిరి, అరకాల మోహన్, అరుకలా ఎలయ్య,రాజయ్య, సత్తు క్రాంతి,సత్తు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# పహల్గాం లోని దుశ్చర్యలకు ఈత మిత్రుల నిరసన

**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు;**

ఇటీవల పర్యాటక కేంద్రమైన పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడిని నిరసిస్తూ లెఫ్ట్ కెనాల్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో మున్నేటి వద్ద ముక్తకంఠంతో ఉగ్రవాద దాడులను నిరసిస్తూ సమైక్య భారత్‌లో ఈరకమైన దుశ్చర్యలకు పాల్పడిన ఉగ్రవాదులను, వారిని ప్రోత్సాహించే వారిని కఠినంగా శిక్షించాలని, మరోమారు ఎవరైనా భారత్‌లోకి అడుగుపెట్టాడానికి భయంతో వణికిపోయేలా శిక్షించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేయడం జరిగింది. అంతేకాక మృతులకు ఒక నిమిషం మౌనం పాటించి వారి కుటుంబాలకు సంతాపం తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో లెఫ్ట్ కెనాల్ స్విమ్మింగ్ అసోసియేషన్, ఖమ్మం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శాగంటి వెంకటేశ్వరరావు, బండి వెంకటేశ్వరరావు, గోపాలపురం వెంకటాచారి, అధ్యక్షులు వేగినాటి లక్ష్మయ్య, కార్యవర్గ సభ్యులు మండెపూడి సత్యనారాయణ, మంకెన శ్రీనివాసరావు, కొమ్ము విజయచందర్, బారి శ్రీనివాసరావు, సిహెచ్ కోటయ్య, జాలాది భద్రయ్య వాసిరెడ్డి మాధవరావు, పాపిన్ని వెంకటేశ్వరరావు, రామారావు, మందడ శ్రీనివాసరావు మరియు అనేక మంది చిన్నారులు, స్విమ్మర్స్ పాల్గొన్నారు.





# ఆదర్శ దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు

### డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:** వనపర్తి మండలం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మెంటేపల్లి రాములు దంపతుల 25వ వివాహ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. వివాహ మహోత్సవ కార్యక్రమానికి డాక్టర్ జిల్లెల్ల ఆదిత్య రెడ్డి హాజరై పుణ్య దంపతులకు వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. వివాహ మహోత్సవ పుణ్య దంపతులు ఇలాంటి వార్షికోత్సవాలు మరెన్నో జరుపుకోవాలని కోరుకుంటూ హృదయపూర్వక 25 వ వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. మీ దాంపత్య జీవితంలో మరో వసంతం నిండిన సందర్భంగా మీ దాంపత్య జీవితం సకల సౌభాగ్యాలతో ఆజన్మాంతం సాగాలని అభినందనలు తెలియజేయడం జరిగింది.ఆ భగవంతుడు మీకు ,మీ కుటుంబానికి ఆయురారోగ్యాలు ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని అన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ధర్మారెడ్డి , వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ దేవన్న యాదవ్, మెంటే పల్లి గ్రామ ప్రజలు,బంధుమిత్రులు పాల్గొనడం జరిగింది.

# భారత్‌లో భారీగా పెరిగిన ఉపాధి

భారత్‌లో ఉపాధి అవకాశాలు భారీగా పెరిగినట్లు, ఉద్యోగాల వృద్ధిలో సానుకూల పవనాలు వీస్తున్నాయని; గ్రామీణ కార్మికులు, మహిళలు స్వయం ఉపాధి కోసం ఆసక్తి చూపిస్తున్నారని ప్రపంచ బ్యాంకు పేర్కొంది. భారత్‌లో ఉద్యోగాలు, ఉపాధి, నిరుద్యోగం, పేదరికం అంశాలపై ప్రపంచ బ్యాంకు నివేదికను విడుదల చేసింది. ఇందులో కీలక విషయాలను వెల్లడించింది. 202122 ఆర్థిక సంవత్సరం నుంచి దేశంలో పనిచేసే వయసులో ఉన్న జనాభా కంటే ఉద్యోగ వృద్ధి రేటు పెరిగిందని వివరించింది. అలాగే శ్రామిక శక్తిలో మహిళలు భాగస్వామ్యం వృద్ధి చెందుతున్నట్లు పేర్కొంది. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం, 202122 ఆర్థిక సంవత్సరం నుంచి దేశంలో ఉద్యోగ వృద్ధి పెరిగింది. ముఖ్యంగా మహిళల్లో ఉపాధి రేటు పెరిగింది. ఆ నివేదికలోని ఇతర ముఖ్యాంశాలు..



**తగ్గిన పట్టణ నిరుద్యోగం**

పట్టణ నిరుద్యోగంలో కూడా గణనీయమైన తగ్గుదల ఉంది. 202425 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో పట్టణ నిరుద్యోగం 6.6 శాతానికి పడిపోయింది. ఇది 201718 తర్వాత నమోదైన అత్యల్ప నిరుద్యోగిత రేటు. 201819 తర్వాత మొదటిసారిగా ఎక్కువ మంది పురుషులు ఉపాధి కోసం గ్రామీణ ప్రాంతాల నుంచి నగరాలకు వలస వెళ్తున్నారు. గ్రామీణ మహిళలు వ్యవసాయ రంగంలో ఎక్కువగా ఉపాధిని పొందుతున్నారు. ఇది దేశవ్యాప్తంగా ఉపాధి విధానాల్లో మార్పును సూచిస్తోంది. దేశంలో యువత నిరుద్యోగం 13.3 శాతంగా ఉంది. ఉన్నత విద్య పూర్తి చేసిన వారిలో నిరుద్యోగ రేటు ఇంకా చాలా ఎక్కువగా ఉంది. యువ నిరుద్యోగులు 29 శాతం మంది ఇప్పటికీ ఉద్యోగాల కోసం వేచి చూస్తున్నారు. వ్యవసాయేతర వేతన ఉద్యోగాల్లో 23 శాతం మాత్రమే అధికారికమైనవి. ముఖ్యంగా గ్రామీణ కార్మికులు, మహిళలు స్వయం ఉపాధి కోసం ఆసక్తి కనబరుస్తున్నారు. ఉద్యోగాలు చేయడం కంటే సొంతంగా వ్యాపారం చేసేందుకు, స్వయం ఉపాధికి ఇష్టపడే వారి సంఖ్య పెరుగుతోంది.

**అసమానతలు తగ్గలేదు..**

ఉపాధి విషయంలో మహిళలు మెరుగుపడినప్పటికీ, వారిపై అసమానతలు మాత్రం తగ్గలేదు. మహిళా ఉద్యోగ రేటు 31 శాతానికి చేరుకుందని, కానీ వేతన ఉద్యోగాల్లో మహిళల కంటే పురుషులు 234 మిలియన్లు ఎక్కువగా ఉన్నారు. 201112లో భారత్‌లో ఐదు అత్యధిక జనాభా కలిగిన రాష్ట్రాలైన ఉత్తర్ ప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, బంగాల్, మధ్యప్రదేశ్‌లో 60 శాతం మంది పేదరికంలో ఉన్నారు. 202223 నాటికి 54 శాతానికి తగ్గారు.

# డిమాండ్ ఉన్న టాప్ 10 ఏఐ ఉద్యోగాలు

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) ఉద్యోగ మార్కెట్ అనూహ్యమైన వృద్ధిని సాధిస్తోంది. యునైటెడ్ స్టేట్స్‌లో 2024లో ఏఐ జాబ్ పోస్టింగ్‌లలో 20% పెరుగుదల నమోదైందని లైట్‌కాస్ట్ నిర్వహించిన 2025 AI ఇండెక్స్ రిపోర్ట్ తెలిపింది. 109 బిలియన్ డాలర్ల ప్రైవేట్ పెట్టుబడులతో ఊపందుకున్న ఈ మార్కెట్, ప్రత్యేక ఏఐ నైపుణ్యాల డిమాండ్‌ను పెంచుతూ ఉద్యోగ రంగాన్ని పునర్నిర్మిస్తోంది.

పైథాన్ అత్యంత డిమాండ్ ఉన్న నైపుణ్యంగా నిలిచింది. గత సంవత్సరం దాదాపు 200,000 ఉద్యోగ పోస్టింగ్‌లలో ఈ నైపుణ్యాన్ని అడిగారు. రిపోర్ట్ ప్రకారం.. పైథాన్, ప్రోగ్రామింగ్, డేటా సైన్స్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్‌తోపాటు అధిక డిమాండ్ ఉన్న టాప్ 10 ఏఐ ఉద్యోగ నైపుణ్యాలు ఇవే..



- **పైథాన్ (199,213 పోస్టింగ్‌లు, 2012-2014తో పోలిస్తే 527% వృద్ధి)**
- **కంప్యూటర్ సైన్స్ (193,341 పోస్టింగ్‌లు, 131% వృద్ధి)**
- **డేటా అనాలిసిస్ (128,938 పోస్టింగ్‌లు, 208% వృద్ధి)**
- **SQL (119,441 పోస్టింగ్‌లు, 133% వృద్ధి)**
- **డేటా సైన్స్ (110,620 పోస్టింగ్‌లు, 833% వృద్ధి)**
- **ఆటోమేషన్ (102,210 పోస్టింగ్‌లు, 361% వృద్ధి)**
- **ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ (101,127 పోస్టింగ్‌లు, 87% వృద్ధి)**
- **అమెజాన్ వెబ్ సర్వీసెస్ (100,881 పోస్టింగ్‌లు, 1,778% వృద్ధి)**
- **అజైల్ మెథడాలజీ (88,141 పోస్టింగ్‌లు, 334% వృద్ధి)**
- **స్కేలబిలిటీ (86,990 పోస్టింగ్‌లు, 337% వృద్ధి)**

**కింగ్ 'పైథాన్'**

పైథాన్ బహుముఖ ప్రజ్ఞ, విస్తృత లైబ్రరీలు దీనిని ఏఐ అభివృద్ధిలో కీలకమైన అంశంగా మార్చాయని స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో డేటా సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఎమిలీ చెన్ అన్నారు. "మెషిన్ లెర్నింగ్ నుండి ఆటోమేషన్ వరకు, పైథాన్ అనివార్యం" ఆమె తెలిపారు. డేటా సైన్స్ (833% వృద్ధి), అమెజాన్ వెబ్ సర్వీసెస్ (1,778% వృద్ధి) వంటి నైపుణ్యాలు అత్యధిక వృద్ధిని సాధించాయి, ఇవి సంక్లిష్ట డేటాసెట్‌ల నుండి సమాచారాన్ని సంగ్రహించే, స్కేలబుల్ ఏఐ సిస్టమ్‌లను నిర్మించే నైపుణ్యాల అవసరాన్ని సూచిస్తున్నాయి. అజైల్ మెథడాలజీ (88,141 పోస్టింగ్‌లు) సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌లో ఇటరేటివ్ విధానాలకు ఉన్న ప్రాధాన్యతను హైలైట్ చేస్తుంది. ఈ డిమాండ్ విస్తరణ టెక్ దిగ్గజ కంపెనీల నుండి స్టార్టప్‌ల వరకు వివిధ రంగాలలో అవకాశాలను సృష్టిస్తోంది. "కంపెనీలు AIని సమగ్రపరచడానికి పోటీ పడుతున్నాయి, దీనికి నైపుణ్యం కలిగిన నిపుణులు అవసరం," అని సిలికాన్ వ్యాలీలో టెక్ రిక్రూటర్ మార్క్ రివెరా అన్నారు. అయితే, ఈ వేగవంతమైన వృద్ధి నైపుణ్యాల అంతరాన్ని గురించి ఆందోళనలను లేవనెత్తింది. కొందరు నిపుణులు విద్యా సంస్థలు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా కరికులమ్‌ను సవరించాలని సూచిస్తున్నారు. ఏఐ రంగం విస్తరిస్తున్న నేపథ్యంలో డిమాండ్ ఉన్న ఈ స్కిల్స్‌లో నైపుణ్యం కలిగిన ఉద్యోగార్థులు ఏఐ జాబ్ బూమ్‌ను సద్వినియోగం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ రంగంలోకి ప్రవేశించాలనుకునే వారికి పైథాన్, డేటా సైన్స్‌లో నైపుణ్యం సాధించడం ఏఐలో లాభదాయకమైన కెరీర్‌కు కీలకంగా మారవచ్చు.

# ఆర్‌ఐఎల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా అనంత్ అంబానీ



ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్(ఆర్ఐఎల్) ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించారు. మే 1 నుంచి అయిదేళ్ల పాటు ఆయన ఈ పదవిలో ఉంటారని కంపెనీ తెలిపింది. వారసత్వ ప్రణాళికలో భాగంగా 2023 ఆగస్టులో ముకేశ్ అంబానీ తన ముగ్గురు పిల్లలు ఈశా, ఆకాశ్, అనంత్‌లను ఆర్ఐఎల్ బోర్డులో నాన్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా చేర్చుకున్నారు. ముకేశ్ పెద్ద కుమారుడు ఆకాశ్ 2022 జూన్ నుంచి టెలికాం అనుబంధ సంస్థ జియో ఇన్ఫోకామ్ ఛైర్మన్‌గా ఉన్నారు. ఈశా రిటైల్, ఇకామర్స్, లగ్జరీ వ్యాపారాలను చూస్తున్నారు. అనంత్ కొత్త ఇంధన వ్యాపారాలను చూసుకుంటున్నారు. టెలికాం, రిలయన్స్ డిజిటల్ ప్రోపర్టీస్‌ను నిర్వహిస్తున్న జియో ప్లాట్‌ఫామ్స్, రిలయన్స్ రిటెయిల్ బోర్డుల్లో ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ నెల 25న జరిగిన ఆర్ఐఎల్ డైరెక్టర్ల బోర్డు సమావేశంలో మానవ వనరులు, నామినేషన్‌రెమ్యునరేషన్ కమిటీ సిఫారసు మేరకు అనంత్ అంబానీని నాన్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నుంచి పూర్తి కాల డైరెక్టర్‌గా తీసుకుని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా 2025 మే 1 నుంచి అమల్లోకి వచ్చేలా నియమించినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ సమాచారమిచ్చింది.

అనంత్ అంబానీ బ్రౌన్ విశ్వవిద్యాలయం నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. రిలయన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియామకం అయిన ముకేశ్ వారసుల్లో ఈయనే తొలి వ్యక్తి. 2022 ఆగస్టులో రిలయన్స్ ఎనర్జీ వర్టికల్ నాయకుడిగా అనంత్‌ను నియమించారు. 2020 మార్చి నుంచి జియో ప్లాట్‌ఫామ్స్ బోర్డులో ఉన్నారు. 2022 మే నుంచి రిలయన్స్ రిటెయిల్ వెంచర్స్ బోర్డులో ఉన్నారు. 2021 జూన్ నుంచి రిలయన్స్ న్యూ ఎనర్జీ, రిలయన్స్ న్యూ సోలార్ ఎనర్జీ బోర్డుల్లోనూ ఉన్నారు. 2022 సెప్టెంబరు నుంచి రిలయన్స్ ఫౌండేషన్ బోర్డులో కొనసాగుతున్నారు.

# ఫ్రీ వైఫై వినియోగం.. ప్రభుత్వం హెచ్చరిక

ఉచితంగా వస్తుందంటే.. ఎవరు మాత్రం కాదంటారు. అయితే ఫ్రీ వైఫై మాత్రం వద్దనే చెప్పాలంటూ.. ప్రభుత్వం హెచ్చరించింది. ఇంతకీ ప్రభుత్వం ఎందుకిలా అంటోంది?, కారణాలు ఏమిటనే విషయాలను ఇక్కడ తెలుసుకుందాం.

విమానాశ్రయాలు, కాఫీ షాపులు మొదలైన పబ్లిక్ ప్రదేశాల్లో ఫ్రీ వైఫై సదుపాయం అందుబాటులో ఉంటుంది. ఇలాంటివి కనెక్ట్ చేసుకోవడం ఏ మాత్రం భద్రం కాదని ప్రభుత్వం వెల్లడించింది. స్కామర్లు, హ్యాకర్లు అమాయక ప్రజలను ట్రాప్ చేయడానికి ఏర్పాటు చేసిన ఓ ఉచ్చు కూడా కావచ్చని స్పష్టం చేసింది.

ఫ్రీ వైఫై ఉపయోగించుకోవడం వల్ల.. ప్రైవేట్ డేటా, ఆర్థిక సమాచారానికి సంబంధించిన విషయాలు మోసగాళ్ల చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉంది. ఇటువంటి మోసాలను అరికట్టడానికి.. డిజిటల్ భద్రతా అవగాహనను మరింత పెంచడానికి CERTIn తన 'జాగ్రూక్త దివాస్' చొరవ కింద, పబ్లిక్ WiFi నెట్‌వర్క్‌ల ద్వారా లావాదేవీలు చేయకుండా పౌరులను హెచ్చరించింది.

సైబర్ నేరగాళ్లు పెరుగుతున్న సమయంలో.. మోసాలు కూడా ఎక్కువైపోతున్నాయి. కాబట్టి ఏదైనా తెలియని లైక్స్ మీద లేదా అటాచ్‌మెంట్ల మీద ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయకూడదు. ఏవైనా ఖాతాలకు స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌లను ఫిక్స్ చేసుకోవడం మంచిది. ఎప్పటికపుడు జాగ్రత్తగా ఉండాలని CERTIn పేర్కొంది.






# పెళ్లికి బంగారం ఏం కొనగలం

దేశంలో పసిడి ధరలు రికార్డు గరిష్ఠాలకు చేరాయి. అంతర్జాతీయ పరిణామాల నేపథ్యంలో 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.లక్ష సమీపంలో కదలాడుతోంది. పసిడి ధరలు ఒక్కసారిగా ఈ స్థాయికి పెరగడం మార్కెట్‌ను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ ధరల ప్రభావం సాధారణ ప్రజలపై బాగానే పడింది. బంగారు ఆభరణాలు కొనుగోలు చేద్దామని ఆశపడ్డ మహిళలు, వెనకడుగు వేసే పరిస్థితి నెలకొంది. సాధారణంగా అక్షయ తృతీయ, పెళ్లిళ్ల సీజన్ సందర్భంగా దేశీయంగా పసిడి కొనుగోళ్లు ఎక్కువగా జరుగుతుంటాయి. ఈసారి అధిక ధరల కారణంగా మధ్యతరగతి కుటుంబాలు ఈ కొనుగోళ్లకు దూరంగా ఉంటాయనే అభిప్రాయం వ్యాపార వర్గాల్లో ఉంది.

పండగలు, కుటుంబ వేడుకలకు పసిడి ఆభరణాలను కొనుగోలు చేయడం మహిళలకు పరిపాటే. ధర ఎంత ఉన్నా, వేడుకల సందర్భంగా కొత్త ఆభరణాలు కొనుగోలు చేయకుంటే వెలితిగా భావిస్తుంటారు. 'నవంబరులో మా కుమార్తె పెళ్లి ఉంది. ఇప్పుడు ఒక్కసారిగా పసిడి ధరలు పెరిగాయి. ఇక పెళ్లికి బంగారం ఏం కొనగలం' అని ఒక మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతకు ముందు 10 గ్రాములు ఆభరణం కొనుగోలు చేస్తే, ఈసారి 5 గ్రాముల్లోనే సరిపెట్టుకోవాల్సి వస్తుందని మరో మహిళ పేర్కొన్నారు.

గత ఏడాది డిసెంబరు నుంచి చూస్తే.. 10 గ్రాముల పసిడి ధర దాదాపు రూ.22,650 (29%) పెరిగింది. షేర్లు, బాండ్లు కంటే పసిడి మంచి ప్రతిఫలాన్ని ఇచ్చిందని నిపుణులు చెబుతున్నారు. భారత్‌లో పసిడిని ఆభరణాలుగా మాత్రమే కాకుండా.. పెట్టుబడికి, అత్యవసరాల్లో ఆదుకునే ఆర్థిక వనరుగా పరిగణిస్తున్నారు. భారత మహిళల వద్ద దాదాపు 24,000 టన్నుల పసిడి ఉందని ప్రపంచ స్వర్ణ మండలి అంచనా వేస్తోంది. ప్రపంచం మొత్తంమీద ఆభరణాల రూపంలో ఉన్న పసిడి నిల్వల్లో మనదేశ వాటా 11 శాతం.

**అక్షయ తృతీయకు తేలికపాటి ఆభరణాలకే గిరాకీ**

పసిడి ధరలు రికార్డు స్థాయిలకు చేరడంపై వర్తకుల్లో కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. దుకాణాలను కొనుగోలుదారులు వస్తున్నా, కొనుగోళ్లలో భారీగా క్షీణత తప్పదని అంచనా వేసుకుంటున్నారు. ఈ ఏడాది అక్షయ తృతీయ (ఈనెల 30)కు తేలికపాటి ఆభరణాలు, ఇతర వస్తువులకే గిరాకీ ఉండొచ్చని విక్రేతలు అంచనా వేస్తున్నారు. 'అక్షయ తృతీయ రోజు పసిడి కొనుగోలు చేయడాన్ని శుభసూచకంగా భావిస్తారు. భారత సంస్కృతి సాంప్రదాయాల్లో దీనికి ప్రత్యేకత ఉంది. సాధారణంగానే ఆ రోజు పసిడి విక్రయాలు అధికంగా నమోదవుతాయి. ఈసారి అధిక ధరల కారణంగా తేలికపాటి ఆభరణాలకైనా గిరాకీ లభిస్తుందని భావిస్తున్నాం' అని ఆలిండియా జెమ్ అండ్ జువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) ఛైర్మన్ రాజేశ్ రోక్డే తెలిపారు.



# ప్రపంచంలోని 10 అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు: లేటెస్ట్ రిపోర్ట్

భారత ఆర్థిక వ్యవస్థ దినదినాభివృద్ధి చెందుతోంది. ఇండియా.. జర్మనీ, జపాన్‌లను అధిగమించి ప్రపంచంలో 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని పలువురు నిపుణులు చెబుతూనే ఉన్నారు.

భారతదేశం ప్రపంచానికి విద్యా కేంద్రంగా మారగలదని, మిగతావన్నీ పక్కన పెడితే మన దేశంలోని ప్రజాస్వామ్యమే మనకు అతిపెద్ద ప్రయోజనమని నీతి ఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రహ్మణ్యం తన అభిప్రాయాన్ని ఇటీవలే వ్యక్తం చేశారు. ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో ఐదవ అతిపెద్దది. వచ్చే ఏడాది చివరి నాటికి మనం నాల్గవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండబోతున్నాము. ఆ తర్వాత ఏడాది మూడవ అతిపెద్దదిగా ఉంటామని ఆయన వివరించారు.

ప్రపంచంలోని టాప్ 10 అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు ప్రపంచ GDPకి గణనీయంగా దోహదపడతాయి. అంతే కాకుండా అంతర్జాతీయ వాణిజ్యం, ఆర్థిక విధానాలపై కూడా బలమైన ప్రభావాన్ని చూపుతాయి. వరల్డ్ ఎకనామిక్ అవుట్‌లుక్ నివేదిక ప్రకారం.. టాప్ 10 అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలు ఇలా..

- **యునైటెడ్ స్టేట్స్ (యూఎస్): 30.507 ట్రిలియన్ డాలర్లు**
- **చైనా: 19.231 ట్రిలియన్ డాలర్లు**
- **జర్మనీ: 4.744 ట్రిలియన్ డాలర్లు**
- **భారతదేశం: 4.187 ట్రిలియన్ డాలర్లు**
- **జపాన్: 4.186 ట్రిలియన్ డాలర్లు**
- **యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే): 3.839 ట్రిలియన్ డాలర్లు**
- **ఫ్రాన్స్: 3.211 ట్రిలియన్ డాలర్లు**
- **ఇటలీ: 2.422 ట్రిలియన్ డాలర్లు**
- **కెనడా: 2.225 ట్రిలియన్ డాలర్లు**
- **బ్రెజిల్: 2.125 ట్రిలియన్ డాలర్లు**

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## ఖమ్మం టాక్స్ ప్రొఫెషనల్స్‌కు

# జీఎస్టీ, ఆదాయపు పన్ను చట్టాలపై సమగ్ర శిక్షణ

- విజయవంతమైన వర్క్‌షాప్ ముగింపు
- కె.జి.పి.ఏ అధ్యక్షులు ఉల్లిబోయిన సైదులు






**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ మరియు ఖమ్మం డిస్ట్రిక్ట్ జి.ఎస్.టి ప్రొఫెషనల్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఖమ్మంలోని వైరా రోడ్డులో గల వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్సి (విఐహెచ్‌ఈ ) నందు జి.ఎస్.టి మరియు ఆదాయపు పన్ను చట్టాలపై సమగ్ర శిక్షణ శిబిరం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ శిక్షణ శిబిరం ఏప్రిల్ 21 నుంచి 26 వరకు ప్రతిరోజూ సాయంత్రం 6:15 నుండి 8:30 గంటల వరకు జరిగింది. మొత్తం పది క్లాసుల ద్వారా 100 మందికి పైగా సభ్యులకు 10 గంటల పాటు శిక్షణ ఇవ్వబడింది.
వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. కె.జి.పి.ఏ అధ్యక్షులు ఉల్లిబోయిన సైదులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎం.వి.జె.కె. కుమార్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ సౌత్ జోన్, నగేష్ రంగీ సౌత్ జోన్ వైస్ ప్రెసిడెంట్ తెలంగాణ హాజరయ్యారు. ముఖ్య వక్తలుగా నాగేంద్రప్రసాద్ పూర్వ చైర్మన్ ఏఐఎఫ్టిపి ఎస్ జెడ్, మరియు కోటా సునీల్ కల్చరల్ కమిటీ చైర్మన్ ఏఐఎఫ్టిపి -ఎస్ జెడ్ పలు ముఖ్యమైన అంశాలపై సభ్యులకు లోతుగా వివరణ ఇచ్చారు. ఈ కార్యక్రమాన్ని సి.హెచ్.వి. కోటేశ్వరరావు, బి. దుర్గాప్రసాద్ మరియు జి. రమేష్ సమన్వయ కర్తలుగా ఉన్నారు, కె.జి.పి.ఏ కార్యవర్గం పూర్తిగా మద్దతు ఇచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసింది. అతిధుల అభిప్రాయాలు ఎం.వి.జె. కుమార్ మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాలోని జి.ఎస్.టి ప్రాక్టీషనర్లు సంఘటితమై వృత్తిలో ముందుకు సాగాలనే సంకల్పం అభినందనీయం అని పేర్కొన్నారు. నరేష్ రంగీ మాట్లాడుతూ, ఈ సమగ్ర శిక్షణ టాక్స్ ప్రొఫెషనల్స్‌కు నైపుణ్యం పెంపొందించడానికి గొప్ప అవకాశమని, వృత్తి పరంగా రాణించేందుకు తోడ్పడుతుందని ప్రశంసించారు. పి.వి. సుబ్బారావు వీడియో మెసేజ్ లో మాట్లాడుతూ, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కూడా ఇటువంటి కార్యక్రమాలు జరగని స్థాయిలో ఖమ్మం జిల్లా శ్రేష్ఠమైన శిక్షణను అందించిందని అభినందించారు.
విఐహెచ్‌ఈ అధ్యక్షులు వాసుదేవరావు, ప్రొఫెషనల్స్ తమ సాంకేతిక పరిజ్ఞానం ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని సూచించారు. ఈ వర్క్‌షాప్ లో ఖమ్మం, హైదరాబాద్, వరంగల్ ఆంధ్రప్రదేశ్ నుండి వచ్చిన పదిమంది ప్రముఖ నిపుణులు అనేక ఆసక్తికర అంశాలపై ప్రగాఢమైన శిక్షణ అందించారు. కార్యక్రమ విజయవంతానికి సహకరించిన కె.జి.పి.ఏ కార్యవర్గ సభ్యులు, ఏఐఎఫ్‌టీపీ ప్రతినిధులు, విఐహెచ్‌ఈ ప్రతినిధులు మరియు ఇతర సభ్యులు అందరికీ అధ్యక్షులు సైదులు , కార్యదర్శి పవన్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.
కె.జి.పి.ఏ కార్యవర్గం, విఐహెచ్‌ఈ ప్రతినిధులు, ఏఐఎఫ్‌టీపీ తెలంగాణ మరియు ఆంధ్ర ప్రదేశ్ ప్రతినిధులు పాల్గొన్నారు.
ఈ తరహా వృత్తి శిక్షణ కార్యక్రమం ఖమ్మం జిల్లాలో జరగడం టాక్స్ ప్రొఫెషనల్స్ సమాజానికి గొప్ప ప్రేరణగా నిలిచింది.

---

## భూ సమస్యల పరిష్కారానికి

# రెవెన్యూ సదస్సులలో దరఖాస్తుల స్వీకరణ...

- తహశీల్దార్లు వెంకటేశ్వర్లు, తఫజ్జుల్ హుస్సేన్ లు.
- భూ భారతి చట్టంతో భూ సమస్యలు వేగంగా పరిష్కారం
- నేలకొండపల్లి మండలం రామచంద్రాపురం, రాజేశ్వరపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించిన తహశీల్దార్లు.






**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చిందని, గ్రామాల్లో చేపడుతున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తుల స్వీకరిస్తున్నట్లు తహశీల్దార్లు వెంకటేశ్వర్లు, తఫజ్జుల్ హుస్సేన్ లు అన్నారు. ఆదివారం నేలకొండపల్లి మండలం రామచంద్రాపురం, రాజేశ్వరపురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, భూ సమస్యలకు సంబంధించి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్లు మాట్లాడుతూ, రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని తావు నీయకుండా జవాబుదారుతనాన్ని పెంచేందుకు భూ భారతి చట్టాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, ముటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయని తెలిపారు. రైతులకు, అధికారులకు సులభంగా అర్థం అయ్యేలా సామాన్య, గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి చట్టం ఉందన్నారు. హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు భూ భారతి లో అవకాశం ఉందన్నారు. పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం లభిస్తుందన్నారు. భూమి హక్కులు ఏ విధంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు చేయవచ్చన్నారు. భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టంలో రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని తెలిపారు. భూదార్ కార్డుల జారీ జరుగుతుందన్నారు. రైతులకు ఉచిత న్యాయ సహాయం లభిస్తుందని తెలిపారు. గ్రామ రెవెన్యూ రికార్డుల నిర్వహణ ఉంటుందని, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి, ఎవరైనా ప్రభుత్వ, భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దుచేసే అధికారం చట్టంలో ఉందన్నారు హక్కుల రికార్డుల్లో తప్పుల సవరణకు, భూమి హక్కులు ఉంది రికార్డులో లేనివారు హక్కుల రికార్డులో నమోదు చేయించుకోవడానికి కొత్త చట్టం వచ్చిన సంవత్సరం లోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా రామచంద్రాపురం గ్రామంలో చేపట్టిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యలకు సంబంధించి 24, రాజేశ్వరపురం గ్రామ రెవెన్యూ సదస్సులో 182 దరఖాస్తులు అధికారులు స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తులకు అధికారులు రశీదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల ఆర్ఐలు రవి, మధు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---



## "చైతన్యదీప్తులు"

ఉషోదయపు ప్రభాత కిరణాలతో,
అరుణారుణ వెలుగురేఖలతో,
నిరాశ, నిస్పృహల నిశరాత్రికి వీడ్కోలు పలుకుతూ,
శీతల పవనాలను తరుముతూ,
నులివెచ్చని కాంతి స్పర్శతో
జగతిని జాగృతిపరచే చైతన్యదీప్తులై,
ప్రకృతి పరవశ కారకులై,
కృషిఖలకు అండదండలై నిలుస్తూ,
కష్టజీవులకు కాయకష్టాలను అందిస్తూ,
వన్యప్రాణులకు జీవం పోస్తూ,
సర్వజీవులకు సుప్రభాతం పలుకుతూ,
సృష్టి కార్యాలకు స్వాగతగీతం ఆలపిస్తూ,
వెలుగు కిరణాలను విస్తరిస్తూ,
చిమ్మచీకట్లను చీల్చుతూ,
అజ్ఞానపు దొంతెరలను అంతమొందిస్తూ,
విజ్ఞానపు మొలకలను అంకురింపచేస్తూ,
ప్రతి మనిషి హృదయంలో ఉషాకిరణాలను ఉదయింపచేస్తూ,
మానవతా సుమాలను వికసింపచేస్తూ,
భానోదయంతో బాధలను మాటుమయం చేస్తూ,
ప్రతి దినం ప్రభాత వెలుగుకిరణాలతో
చైతన్యదీప్తులను పుడమిపై ప్రసరింపజేస్తున్నాడు
దినకరుడు సూర్యభగవానుడు!

ఈ ఉషోదయపు ఉషాకిరణాలు.. జీవులకు జీవం పోసే జీవప్రదాతలు!

రచయిత : పేరు: ఆళ్ల నాగేశ్వరరావు,
ఊరు: తెనాలి, ఫోన్ నంబర్: 7416638823

---

## నేడు జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం..

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



**ఖమ్మం బ్యూరో, తెలంగాణ ముచ్చట్లు:** నేడు (సోమవారం) మ. 2.30 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ (దిశ) కమిటి సమావేశాన్ని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు, దిశ కమిటి చైర్మన్ రామసహాయం రఘురాం రెడ్డి అధ్యక్షతన చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అట్టి సమావేశంలో జిల్లాలో నిర్దేశిత కేంద్ర పథకముల అమలులో ప్రగతి, చర్యలపై సమీక్షించనున్నట్లు కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

---

# పాకిస్థానీయులకు ముగిసిన డెడ్‌లైన్..

(మొదటి పేజీ తరువాయి)



వీరిలో తొమ్మిది మంది దౌత్యవేత్తలు, అధికారులు ఉన్నట్లు తెలిపాయి.
కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో ఏప్రిల్ 24 నుంచి భారత్‌లో ఉన్న పాకిస్థానీయులు దేశం వీడటం ప్రారంభించారు. తొలి మూడు రోజుల్లో పరిమిత సంఖ్యలో వెళ్లిపోగా.. ఆదివారం ఒక్కరోజే 287 మంది పాక్ జాతీయులు వెళ్లిపోయారు. కొంతమంది ఎయిర్‌పోర్టుల ద్వారా వెళ్లే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. అయితే, పాకిస్థాన్‌కు నేరుగా విమాన సర్వీసులు లేనందున ఇతర దేశాలకు వెళ్లి.. అక్కడ నుంచి పాక్‌కు వెళ్లిపోయి ఉండవచ్చని సరిహద్దులో ఉన్న ప్రొటోకాల్ అధికారులు వెల్లడించారు. ఇదే సరిహద్దు ద్వారా 850 మంది భారతీయులు పాకిస్థాన్ నుంచి స్వదేశానికి తిరిగి వచ్చినట్లు చెప్పారు.

**పాక్ పౌరులు భారత్‌లోనే ఉంటే.. మూడేళ్ల జైలు, రూ.3 లక్షల జరిమానా!**

సార్క్ వీసాదారులకు ఏప్రిల్ 26నే గడువు ముగిసింది. మెడికల్ వీసాలు ఉన్నవారికి ఏప్రిల్ 29 వరకు ఉంది. ఇక వీసా ఆన్ అరైవల్, బిజినెస్, ఫిల్మ్, జర్నలిస్ట్, ట్రాన్సిట్, స్టూడెంట్, విజిటర్ తదితర 12 విభాగాల వీసాదారులకు నేటితో (ఏప్రిల్ 27) గడువు ముగిసింది. దీంతో పాక్ జాతీయులు స్వదేశానికి తిరుగుముఖం పట్టడంతో అట్టారీ సరిహద్దులో హడావిడి నెలకొంది. తమ బంధువులకు వీడ్కోలు చెప్పేందుకు అనేక మంది భారతీయులు కూడా అక్కడకు చేరుకున్నారు.
కేంద్ర ఆదేశాల ప్రకారం రాష్ట్రంలో ఉన్న పాకిస్థానీయులందర్నీ గుర్తించామని, వారిని తిరిగి పంపించేందుకు ఏర్పాట్లు చేశామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ వెల్లడించారు. మీడియాలో వస్తున్నట్లుగా ఎవ్వరూ తప్పిపోలేదన్నారు. రాష్ట్రంలో 5050 మంది పాక్ జాతీయులు ఉండగా.. వారిలో స్వల్పకాలిక వీసాతో వచ్చిన వెయ్యి మందిని వెళ్లిపోవాలని చెప్పామన్నారు.
తెలంగాణలో 208 మంది పాక్ జాతీయులు ఉండగా.. వారిలో 156 మంది దీర్ఘకాలిక, 13 మంది స్వల్పకాలిక వీసాలు కలిగి ఉన్నారని డీజీపీ జితేందర్ వెల్లడించారు. మరో 39 మంది వైద్య, బిజినెస్ వీసాలపై వచ్చారని చెప్పారు. మధ్యప్రదేశ్‌లో 228 మంది ఉండగా.. వారంతా ఇప్పటికే వెళ్లిపోయినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఏప్రిల్ 30లోగా పాక్ జాతీయులను వెనక్కి పంపించే ప్రక్రియను పూర్తిచేస్తామని యూపీ డీజీపీ వెల్లడించారు. కేరళలో 104 మందికిగాను 99 మంది దీర్ఘకాలిక వీసా కలిగి ఉన్నారని, మిగతా ఐదుగురు టూరిస్టు లేదా మెడికల్ వీసా ఉన్నవారు ఇప్పటికే దేశం విడిచి వెళ్లారని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. బిహార్‌లో ఉన్న 19 పాక్ జాతీయులంతా గడువులోగా వెళ్లిపోయినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. ఒడిశాలో 12 మంది, గోవాలో ముగ్గురు, గుజరాత్‌లో ఏడుగురు పాకిస్థానీయులు ఉండగా.. గడువులోగా స్వదేశానికి వెళ్లిపోవాలని సూచించినట్లు ఆయా ప్రభుత్వాలు పేర్కొన్నాయి. అయితే, గుజరాత్‌లో 438 మంది భారత పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.


---

# భారత్‌పై దాడి కోసం 130 అణు బాంబులు..

## పాక్ మంత్రి సంచలన వ్యాఖ్యలు



**ఇస్లామాబాద్, (సిటీ టైమ్స్):** పాకిస్తాన్ రైల్వే మంత్రి హనీఫ్ అబ్బాసీ బహిరంగంగా బెదిరింపులకు దిగాడు. భారత్‌పై దాడి చేసేందుకు పాకిస్తాన్ 130కి పైగా అణు ఆయుధాలతో పాటు ఘోరి, షాహీన్, ఘజ్నవి మిసైళ్ళను సిద్ధం చేసినట్లు మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు.
రాక్షసత్వానికి పరాకాష్ఠగా నిలిచిన పహల్గాం ఉగ్రదాడిపై రగిలిపోతున్న భారత్ తన చర్యల ద్వారా దాయాదిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. సింధూ నదీ జలాల నిలిపివేత, పాకిస్తాన్ జాతీయుల వీసాలు రద్దు, ఇతర వాణిజ్య సంబంధాలను నిలిపివేసింది. దీంతో ఏం చేయాలో పాలుపోక దీనంగా చూస్తోంది. ఈ క్రమంలో హనీఫ్ అబ్బాసీ భారత్‌ను కవ్వించే ప్రయత్నం చేశారు. భారత్ ఇండస్ వాటర్ ఒప్పందాన్ని నిలిపివేస్తే యుద్ధానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. యుద్ధం చేసేందుకు తాము సన్నద్ధంగా ఉన్నామని, దేశ వ్యాప్తంగా అణు ఆయుధాల్ని సిద్ధం చేశామన్నారు. ఆ అణు ఆయుధాలు ప్రదర్శన కోసం కాదని, భారత్‌పై దాడి చేసేందుకేనని చెప్పారు. స్థానిక మీడియాతో మాట్లాడుతూ.. 'నీటి సరఫరాను ఆపితే మనతో యుద్ధం చేసేందుకు భారత్ సిద్ధంగా ఉండాలి. మన వద్ద ఉన్న సైనిక పరికరాలు, మిసైళ్ళు ప్రదర్శన కోసం కాదు. మన అణు ఆయుధాలు ఎక్కడ ఉన్నాయో ఎవరికీ తెలియదు. నేను మళ్లీ చెబుతున్నాను, ఈ బాలిస్టిక్ మిసైళ్ళు, అవన్నీ భారత్‌పై దాడి చేసేందుకు సిద్ధంగా ఉన్నాయని వ్యాఖ్యానించారు.



అంతకుముందు పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ దేశం గత మూడు దశాబ్దాలుగా ఉగ్రవాద సంస్థల్ని పెంచి పోషించిందని ఒప్పుకున్నారు. దాని ఫలితమే ఈ దుర్భర పరిస్థితులకు కారణమని పశ్చాత్తాపం వ్యక్తం చేశారు.

# సమయం కోరిన మహేశ్‌బాబు

ప్రముఖ నటుడు మహేశ్‌బాబు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి లేఖ రాశారు. షూటింగ్ ఉన్నందున సోమవారం విచారణకు హాజరు కాలేకపోతున్నట్టు అందులో పేర్కొన్నారు. మరో తేదీ కేటాయించాలని ఈడీ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సాయిసూర్య డెవలపర్స్, సురానా ప్రాజెక్టు కేసుల్లో కొన్ని రోజుల క్రితం మహేశ్‌బాబుకు ఈడీ నోటీసులు ఇచ్చిన సంగతి తెలిసిందే. ఆ రెండు సంస్థలకు ఆయన ప్రచారకర్తగా ఉన్నారు. పెట్టుబడులు పెట్టేందుకు ఇన్‌ఫ్లుయెన్స్ చేశారనే అభియోగంపై ఈడీ నోటీసులు జారీ చేసింది.








# ‘ఆమె ప్రేమ తప్ప మిగతావన్నీ మారిపోయాయి’..

నటి మానుషి చిల్లర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అక్కర్లేదు. ఈ బ్యూటీ ఫెమినా మిస్ ఇండియా వరల్డ్ 2017 టైటిల్‌ను గెలుచుకుంది. ఈమె యష్‌రాజ్ ఫిల్మ్‌తో మూడు సినిమాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి.. సామ్రాట్ పృథ్వీరాజ్‌తో సినీ ఎంట్రీ ఇచ్చింది. తర్వాత అనేక ఆడిషన్లు, ట్రయల్స్ అనంతరం అక్షయ్ కుమార్‌కు భార్య పాత్రలో ఓ సినిమాలో అవకాశం కొట్టేసింది. కానీ ఈ మూవీ బాక్సాఫీసు వద్ద పెద్ద విజయం సాధించలేకపోయింది.
అయినప్పటికీ మానుషి చిల్లర్ మరిన్ని అవకాశాలు సంపాదించుకుంది. ది గ్రేట్ ఇండియన్ ఫ్యామిలీ అనే కామెడీ సినిమాలో నటించి ప్రేక్షకుల మెప్పు పొందింది. విక్కి కౌశల్ సరసన నటించి జనాల్ని ఆకట్టుకుంది. తెలుగు, హిందీ ద్విభాషా చిత్రమైన ఆపరేషన్ వాలెంటైన్‌లో మెగా హీరో వరుణ్ తేజ్ సరసన చిలార్ వింగ్ కమాండర్ పాత్ర పోషించింది. వీటితో పాటుగా టైగర్ ష్రాఫ్ నటించిన బడే మియాన్ చోటే మియాన్‌లో..
టెహ్రాన్‌లో జాన్ అబ్రహంకు జోడిగా నటించింది. ఈ అమ్మడు సినిమాల్లో బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం ఫుల్ యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా మానుషి నెట్టింట ఓ పోస్ట్ పెట్టింది. పలు ఫొటోలు పంచుకుని ఓ క్యాప్షన్ రాసుకొచ్చింది. ‘‘నా పాత పెయింట్స్, బ్రష్‌ల పెట్టెను చూడటానికి చివరి వరకు స్వైప్ చేయండి, ఇప్పటికీ నా అమ్మమ్మ భద్రపరిచింది. ఆమె ప్రేమ తప్ప మిగతావన్నీ మారిపోయాయి. బాల్యాన్ని ఆమె హృదయానికి దగ్గరగా ఉంచుకుంది’’. అంటూ రాసుకొచ్చింది.



# వేవ్స్‌లో ‘రామాయణ’ ఫస్ట్‌లుక్ ?

కెరీర్ ఆరంభం నుంచే కొత్తదనం నిండిన కథల్ని ఎంచుకుంటూ ప్రేక్షకులకు చేరువయిన సాయిపల్లవి.. త్వరలో సీతగా తెరపైకి రావడానికి సన్నద్ధమవుతోంది. ఆమె, బాలీవుడ్ కథానాయకుడు రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం ‘రామాయణ’. నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ వీడియోను మరికొన్ని రోజుల్లో మొదలు కానున్న ‘వేవ్స్’ సమ్మిట్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. “ఈ ఏడాది శ్రీరామనవమికే ఈ సినిమాకు సంబంధించిన ఓ వీడియోను విడుదల చేయాలని అనుకుంది చిత్రబృందం. కానీ అనుకోని కారణాలతో అది జరగలేదు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీర్చిదిద్దుతున్న ‘రామాయణ’ పరిచయ వీడియోను ప్రదర్శించేందుకు వేవ్స్ సమ్మిట్ సరైన వేదిక అని నిర్ణయించుకున్నారు. త్వరలో పూర్తి వివరాల్ని అధికారికంగా వెల్లడించనున్నార”ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఇందులో హీరో యశ్.. రావణుడి పాత్రలో కనిపించనున్నారు.

# చెక్ చేసుకుని.. రీస్టార్ట్ చేయాలి..



నాని హీరోగా శైలేశ్ కొలను దర్శకత్వం వహించిన చిత్రం ‘హిట్ 3’. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఆంగ్ల వెబ్‌సైట్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన బాలీవుడ్ ప్రస్తుత పరిస్థితి గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రతి పరిశ్రమలో ఏదో ఒక సమయంలో ఇలాంటి గడ్డు పరిస్థితులు ఎదురవుతాయని చెప్పారు. బాలీవుడ్ తిరిగి నిలదొక్కుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.
‘‘బాలీవుడ్ అనే కాదు.. పరిశ్రమ ఏదైనా ఇలాంటి గడ్డు పరిస్థితులు ఎదురుకావడం సహజం. ప్రస్తుతం దక్షిణాది చిత్రాలు అంతటా రాణిస్తున్న మాట వాస్తవమే అయినప్పటికీ.. టాలీవుడ్ కూడా ఇలాంటి రోజులను చూసింది. కొన్ని నెలల పాటు సినిమాలు ఆశించిన ఫలితాలను అందించలేదు. సినిమాలు ఆడక మేము థియేటర్లు మూసి వేసిన సందర్భాల్లూ ఉన్నాయి. అలా, అని కుంగిపోలేదు. మరింత ఉత్సాహం, పట్టుదలతో చిత్రాలు రూపొందించి ప్రేక్షకులకు అందించాం. హిందీలోనూ అదే పరిస్థితి రానుందని భావిస్తున్నా. ఇప్పుడున్న రోజుల్లో భాషతో సంబంధం లేకుండా మంచి చిత్రాలను వీక్షించాలని ప్రతి ఒక్కరూ అనుకుంటున్నారు. గొప్ప చిత్రాలను తెరకెక్కించాలనే ఆశతో ఫిల్మ్ మేకర్స్ వర్క్ చేస్తున్నారు. బాలీవుడ్ ఒకానొక సమయంలో ఎన్నో అద్భుతమైన చిత్రాలు తెరకెక్కించింది. చిన్నతనంలో ఆయా చిత్రాలను మేమంతా వీక్షించాం. కాబట్టి, ఆ పరిశ్రమ మళ్లీ నిలదొక్కుకుంటుంది. ఇలాంటి గడ్డు కాలం ఎదురైనప్పుడు.. ఒక్కసారి ఆగి మనల్ని మనం చెక్ చేసుకుని రీస్టార్ట్ చేయాల్సి ఉంటుంది’’ అని నాని చెప్పారు.
‘హిట్’ యూనివర్స్‌లో భాగంగా రూపొందిన మూడో చిత్రమే ‘హిట్ 3’. శ్రీనిధి శెట్టి కథానాయిక. అర్జున్ సర్కార్ అనే పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా నాని కనిపించనున్నారు. మే 1న ఈ సినిమా విడుదల కానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలను సినిమాపై అంచనాలు పెంచాయి.

# ఒక్క మూవీ.. కాయదు కి క్రేజీ ఆఫర్స్



కొన్నిసార్లు ఒక్క సినిమాతో హీరోయిన్లు ఓవర్ నైట్ స్టార్స్ అయిపోతుంటారు. అలా కొన్నిరోజుల క్రితం రిలీజైన 'డ్రాగన్'తో కాయదు లోహర్ స్టార్ అయిపోయిందని చెప్పొచ్చు. ఇప్పటికే తెలుగులో ఓ ఆఫర్ దక్కించుకున్న ఈమె ఇప్పుడు మరో బంపర్ ఆఫర్ కొట్టేసింది.
అసోంకు చెందిన కాయదు లోహర్.. 'అల్లూరి' అనే తెలుగు సినిమాతో హీరోయిన్ అయింది. కానీ పెద్దగా గుర్తింపు రాలేదు. దీంతో తమిళంలో ప్రయత్నించగా.. ప్రదీప్ రంగనాథన్ 'డ్రాగన్'లో అవకాశమొచ్చింది. ఇదే మూవీతో కాయదుకు మంచి క్రేజ్ కూడా వచ్చింది.
ఈ క్రమంలోనే తెలుగులో విశ్వక్ సేన్‌అనుదీప్ కాంబోలో తీస్తున్న 'ఫంకీ'లో కాయదు హీరోయిన్ గా సెలెక్ట్ కాగా.. ఇప్పుడు తమిళ హీరో శింబు సరసన నటించే అవకాశం కూడా దక్కింది. ఈ మేరకు అధికారికంగా పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ మూవీస్ కూడా హిట్ అయితే ఇండస్ట్రీలో కాయదు లైఫ్ సెట్ అయిపోయినట్లే!

# హెరిటేజ్ హంగులో రకుల్ గ్లామర్ అదుర్స్..

హిందుస్తాన్ టైమ్స్ సిటీ షోస్టాపర్స్ కార్యక్రమం కోసం ఇటీవల రకుల్ ప్రీత్ సింగ్ దిగిన ఫోటోలు అందరినీ మంత్రముగ్ధులను చేస్తున్నాయి.నవ్యసాబై లివా రూపొందించిన పాతకాలపు పూల డిజైన్ చీరలో ఆమె తళతళ మెరిసిపోతోంది. చీర అందాన్ని మరింత పెంచుతూ, రకుల్ అరుదైన బస్రా ముత్యాలతో తయారైన నెక్లెస్ ధరించింది.. చౌలాజ్ హెరిటేజ్ జ్యూవెల్స్ కలెక్షన్‌లో ఉన్న, వందేళ్ల నాటి ప్రాచీన నెక్లెస్ అది..ముంబైలోని ది ఒబెరాయ్ హోటల్ వేదికగా జరిగిన ఈ ఫోటోషూట్‌కు శారా అష్రాఫ్ ప్రయాగ్ నేతృత్వం వహించారు. ఫోటోగ్రాఫర్ తేజస్ నేరుర్కర్ కెమెరా క్లిక్‌లతో రకుల్ అందాన్ని అద్భుతంగా పట్టుకున్నారు.
స్టైలిస్ట్ కరిష్మా పాటిదార్ మినహా, ఒక గొప్ప క్రియేటివ్ బృందం ఈ మేజిక్‌కు సహకరించింది. ఈ ఫోటోషూట్ సందర్భంగా రకుల్ తన సినీ ప్రయాణాన్ని తలుచుకుంది. ఢిల్లీ అమ్మాయి బాలీవుడ్ స్టార్‌గా ఎదిగిన తన కథను చర్చించింది. సినీ రంగంలోకి అడుగుపెట్టినప్పుడు "ఇట్ గర్ల్" అంటే ఏమిటో కూడా తెలియదని చెప్పిన రకుల్, అప్పటి వాస్తవాలను గుర్తు చేసింది.. హీరోయిన్ల కెరీర్ అయిదారు ఏళ్లకే ముగుస్తుందని తప్పుడు అభిప్రాయాలు విస్తరించాయని చెప్పింది. అయితే ఈ రోజులలో పరిస్థితి పూర్తిగా మారిపోయిందని రకుల్ విశ్వాసం వ్యక్తం చేసింది. "సౌందర్యం, కృషి, నిబద్ధత ఉంటే, వయస్సు తేడా లేకుండా హీరోయిన్లు సుదీర్ఘకాలం తమ కీర్తిని నిలుపుకోగలరని" ఆమె నమ్మకం. అమితాబ్ బచ్చన్, టబు లాంటి వారిలా ఇండస్ట్రీలో ఓ చిరస్థాయిగా నిలవాలన్నది ఆమె లక్ష్యం. తెలుగు సినిమాలతో తన ప్రయాణాన్ని ప్రారంభించిన రకుల్, "వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్", "లౌక్యం" లాంటి హిట్‌లతో తొలి మెట్లు ఎక్కింది. తరువాత టాలీవుడ్, బాలీవుడ్‌లలో తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరచుకుంది. "దే దే ప్యార్ దే", "డాక్టర్ జి", "రన్‌వే 34" వంటి సినిమాల్లో తన నటనా ప్రతిభను నిరూపించింది.



# రామప్ప ఆలయంలో మిస్ ఇండియా నందిని





తెలంగాణ రాష్ట్రానికి ఒక గొప్ప అవకాశం లభించింది. ప్రతిష్టాత్మకమైన మిస్ వరల్డ్ 2025 పోటీలు ఇక్కడ నిర్వహించనున్నారు.ఈ నేపథ్యంలో, మిస్ ఇండియా 2023 నందిని గుప్తా ఇటీవల తెలంగాణలోని చారిత్రాత్మక రామప్ప ఆలయాన్ని సందర్శించారు. యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొందిన ఈ అద్భుతమైన ఆలయానికి ఆమె సాంప్రదాయ దుస్తుల్లో విచ్చేసి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఒక సాధారణ తెలుగు అమ్మాయి వలె లంగా ఓణీ ధరించి, స్థానిక సంస్కృతిని గౌరవిస్తూ ఆమె ఆలయ ప్రాంగణంలో కలియ తిరిగారు. శిల్పకళా నైపుణ్యానికి ప్రసిద్ధి చెందిన రామప్ప ఆలయ నిర్మాణ శైలిని, దాని ఆధ్యాత్మిక ప్రాధాన్యతను ఆమె ఎంతో అభినందించారు. ఆలయ చరిత్రను అర్చకుల ద్వారా తెలుసుకున్నారు.
తెలంగాణలో మిస్ వరల్డ్ వంటి అంతర్జాతీయ కార్యక్రమం నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణం. ఈ పోటీల ద్వారా తెలంగాణ సంస్కృతి, పర్యాటక ప్రదేశాలు ప్రపంచవ్యాప్తంగా మరింతగా ప్రాచుర్యం పొందుతాయని భావిస్తున్నారు. మిస్ ఇండియా నందిని గుప్తా రామప్ప ఆలయాన్ని సందర్శించడం తెలంగాణ యొక్క గొప్ప వారసత్వాన్ని, శాశ్వతమైన సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పే ప్రయత్నంలో ఒక భాగం. ఆమె రాక, రాబోయే మిస్ వరల్డ్ పోటీలు రాష్ట్రంలో మరింత ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# హ్యాట్రిక్ విజయంతో అగ్రస్థానం



ఐపీఎల్ 18లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు హ్యాట్రిక్ కొట్టి పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది. దిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్ ఆ జట్టు 6 వికెట్ల తేడాతో నెగ్గింది. దీంతో ఆర్సీబీ ప్లే ఆఫ్స్‌కు మరింత చేరువైంది. తొలుత దిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (41) టాప్‌స్కోరర్. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 18.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కృనాల్ పాండ్య (73*; 47 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (51; 47 బంతుల్లో 4 ఫోర్లు) అర్ధశతకాలతో చెలరేగారు. దిల్లీ బౌలర్లలో అక్షర్ పటేల్ రెండు వికెట్లు తీశాడు. ఆర్సీబీకి ఇది ఏడో విజయం.

లక్ష్యఛేదనకు దిగిన ఆర్సీబీకి శుభారంభమేమీ దక్కలేదు. తొలి రెండు ఓవర్లలో 19 పరుగులు రాగా.. అక్షర్ పటేల్ వేసిన మూడో ఓవర్‌లో మూడు బంతుల వ్యవధిలో జాకబ్ బెథెల్ (12), దేవ్‌దత్ పడిక్కల్ (0) ఔటయ్యారు. రజత్ పటీదార్ (6) కోహ్లితో సమన్వయ లోపంతో రనౌటయ్యాడు. కరుణ్ నాయర్ సూపర్ త్రో విసరడంతో పటీదార్ వెనుదిరిగాడు. తర్వాత కృనాల్ పాండ్య, కోహ్లి నిలకడగా సింగిల్స్, డబుల్స్ రాబడుతూ ఇన్నింగ్స్‌ను గాడిలో పెట్టారు. ఈ జోడీ నాలుగో వికెట్‌కు 119 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. 10 ఓవర్లకు స్కోరు 64/3కి చేరగా.. తర్వాత కృనాల్ నెమ్మదిగా జోరు పెంచాడు. చమీర బౌలింగ్‌లో ఓ సిక్స్ కొట్టిన పాండ్య.. ముకేశ్ వేసిన 13 ఓవర్‌లో వరుసగా రెండు బంతులను స్టాండ్స్‌లోకి పంపాడు. కుల్‌దీప్ బౌలింగ్‌లో సిక్సర్ రాబట్టిన కృనాల్.. అక్షర్ వేసిన 15 ఓవర్‌లో ఫోర్ కొట్టి అర్ధ శతకం అందుకున్నాడు. మరోవైపు, సింగిల్స్‌తో స్ట్రైక్‌రోటేట్ చేసిన కోహ్లి 45 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ముకేశ్ బౌలింగ్‌లో కృనాల్ వరుసగా రెండు బౌండరీలు రాబట్టాడు. చమీర బౌలింగ్‌లో భారీ షాట్ ఆడిన కోహ్లి బౌండరీ లైన్ వద్ద స్టార్క్‌కు చిక్కి వెనుదిరిగాడు. తర్వాత టిమ్ డేవిడ్ (19; 5 బంతుల్లో) వరుసగా 6, 4, 4, 4 బాదేసి పని పూర్తి చేశాడు.



తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన దిల్లీని బెంగళూరు బౌలర్లు తక్కువ స్కోరుకే కట్టడి చేశారు. కేఎల్ రాహుల్ (41; 39 బంతుల్లో) రాణించగా.. చివర్లో ట్రిస్టన్ స్టబ్స్ (34; 18 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులు మెరిపించాడు. ఓపెనర్ అభిషేక్ పోరెల్ (28; 11 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడినా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు. ఫాఫ్ డుప్లెసిస్ (22), అక్షర్ పటేల్ (15) పరుగులు చేశారు. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 3, హేజిల్‌వుడ్ 2, యశ్ దయాళ్, కృనాల్ పాండ్య చెరో వికెట్ తీశారు.





## ముంబయి వరుసగా ఐదో విజయం



ఐపీఎల్ (IPL) 18 సీజన్‌లో తొలుత తడబడ్డ ముంబయి ఇండియన్స్ (Mumbai Indians) ఇప్పుడు వరుస విజయాలతో దూసుకుపోతోంది. ఆదివారం వాంఖడే స్టేడియం వేదికగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ముంబయి 54 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. హార్దిక్ సేనకు వరుసగా ఇది ఐదో గెలుపు. తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 215 పరుగులు చేసింది. ఈ భారీ లక్ష్యఛేదనలో లఖ్‌నవూ సరిగ్గా 20 ఓవర్లలో 161 పరుగులకు ఆలౌటైంది. మిచెల్ మార్ష్ (34; 24 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), నికోలస్ పూరన్ (27; 15 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), ఆయుష్ బదోని (35; 22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), డేవిడ్ మిల్లర్ (24; 16 బంతుల్లో 3 ఫోర్లు) దూకుడుగా ఆడినా భారీ స్కోర్లు చేయలేకపోయారు. ఐదెన్ మార్‌క్రమ్ (9), రిషభ్ పంత్ (4), అబ్దుల్ సమద్ (2) సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. ముంబయి బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా (Jasprit Bumrah) (4/22) లఖ్‌నవూ బ్యాటర్లను బెంబేలెత్తించాడు. ఇన్నింగ్స్ ఆరంభంలో మార్‌క్రమ్‌ను ఔట్ చేసి లఖ్‌నవూకు గట్టి షాక్ ఇచ్చిన బుమ్రా.. 16 ఓవర్‌లో మిల్లర్, సమద్, అవేశ్ ఖాన్ (0)ని పెవిలియన్‌కు పంపాడు. ట్రెంట్ బౌల్ట్ (3/20) కూడా అదరగొట్టాడు. విల్ జాక్స్ 2, కోర్బిన్ బాష్ ఒక వికెట్ పడగొట్టారు. లఖ్‌నవూకు 10 మ్యాచ్‌ల్లో ఇది ఐదో ఓటమి. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన ముంబయి.. ఓపెనర్ ర్యాన్ రికెల్‌టన్ (58; 32 బంతుల్లో 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), సూర్యకుమార్ యాదవ్ (54; 28 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ శతకాలతో చెలరేగడంతో భారీ స్కోరు సాధించింది. ఎదుర్కొన్న తొలి రెండు బంతులను సిక్స్‌లుగా మలిచి ఊపుమీద కనిపించిన రోహిత్ శర్మ (12; 5 బంతుల్లో) త్వరగానే నిష్క్రమించాడు. విల్ జాక్స్ (29; 21 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించాడు. తిలక్ వర్మ (6), హార్దిక్ పాండ్య (5) నిరాశపర్చారు. చివర్లో నమన్ ధీర్ (25*; 11 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), కోర్బిన్ బాష్ (20; 10 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) మెరుపులు మెరిపించారు. లఖ్‌నవూ బౌలర్లలో మయాంక్ యాదవ్ 2, అవేశ్ ఖాన్ 2, దిగ్వేశ్ సింగ్ రాఠీ, ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

# శ్రీలంకను చిత్తు చేసిన టీమిండియా..

శ్రీలంక వేదికగా జరుగుతున్న మహిళల ముక్కోణపు వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో భారత్ శుభారంభం చేసింది. ఈ సిరీస్‌లో భాగంగా ఆదివారం శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో 9 వికెట్ల తేడాతో టీమిండియా ఘన విజయం సాధించింది.

వర్షం కారణంగా ఈ మ్యాచ్‌ను 39 ఓవర్లకు కుదించారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ దిగిన శ్రీలంక 38.1 ఓవర్లలో 147 పరుగులకు ఆలౌటైంది. ఇండియన్ స్పిన్నర్ స్నేహ్ రాణా మూడు వికెట్లు పడగొట్టి లంక పతనాన్ని శాసించింది. ఆమెతో పాటు దీప్తి శర్మ, నల్లపు రెడ్డి చరణి తలా రెండు వికెట్లు సాధించారు.

లంక బ్యాటర్లలో హసనీ పెరీరా(30) టాప్ స్కోరర్‌గా నిలవగా.. కవిషా దిల్హారి(25), సంజీవనీ(22) రాణించారు. కెప్టెన్ ఆతపట్టు(7)తో సహా మిగితా బ్యాటర్లంతా దారుణంగా విఫలమయ్యారు. అనంతరం 148 పరుగుల లక్ష్యాన్ని భారత్ కేవలం ఒక్క వికెట్ మాత్రమే కోల్పోయి 29.4 ఓవర్లలో చేధించింది.

భారత బ్యాటర్లలో ప్రతీక రావల్(50 నాటౌట్) హాఫ్ సెంచరీతో మెరవగా.. మంధాన(43), డియోల్(48 నాటౌట్) రాణించారు. శ్రీలంక బౌలర్లలో రణవీర ఒక్క వికెట్ సాధించారు. టీమిండియా తమ తదుపరి మ్యాచ్‌లో ఏప్రిల్ 29న కొలంబో వేదికగా దక్షిణాఫ్రికాతో తలపడనుంది.



## ఎవరూ ఆడకపోతే ఏం చేస్తాం..



చెన్నై సూపర్‌కింగ్స్ పరాజయపరంపర కొనసాగుతున్న నేపథ్యంలో ఆ జట్టు కెప్టెన్ ధోని నిస్సహాయతను వ్యక్తం చేశాడు. అయిదారుగురు ఆటగాళ్లు విఫలమవుతూ ఉంటే మంచి ఫలితాలు రాబట్టడం కష్టమని అన్నాడు. శుక్రవారం హైదరాబాద్ చేతిలో ఓటమితో సీఎస్కే ప్లేఆఫ్స్ దారులు దాదాపుగా మూసుకుపోయిన సంగతి తెలిసిందే. “ఇలాంటి టోర్నమెంట్లో ఒకటి రెండు లోపాలు ఉంటే సరిదిద్దుకోవచ్చు. కానీ ఆటగాళ్లలో ఎక్కువ మంది బాగా ఆడకపోతే చాలా కష్టం” అని మ్యాచ్ అనంతరం ధోని వ్యాఖ్యానించాడు. చెన్నై ఇప్పటికే తొమ్మిది మ్యాచ్‌ల్లో 19 మంది ఆటగాళ్లను ఆడించింది. వివిధ మేళవింపులను ప్రయత్నించడం మినహా తనకు మరో దారి లేకపోయిందని ధోని అన్నాడు. ఎక్కువ మంది ఆటగాళ్లు విఫలం కావడంతో ఎక్కువ మార్పులు చేయాల్సివచ్చిందని చెప్పాడు. మధ్య ఓవర్లలో స్పిన్నర్లను బ్యాటర్లు ఎటాక్ చేయలేకపోవడం సీఎస్కే పేలవ ప్రదర్శనకు ప్రధాన కారణాల్లో ఒకటని ధోని అన్నాడు.

## భారీ సెంచరీతో కదంతొక్కిన స్టార్ క్రికెటర్ కొడుకు



ఆఫ్ఘనిస్తాన్ ఆల్‌టైమ్ గ్రేట్ ఆల్‌రౌండర్ మొహమ్మద్ నబీ కొడుకు హసన్ ఐసాఖిల్ స్వదేశంలో జరుగుతున్న ఓ ఇంటర్ రీజియన్ టోర్నీలో (మెర్వైస్ నికా రీజినల్ 3డే ట్రోఫీ) భారీ సెంచరీతో కదంతొక్కాడు. ఈ టోర్నీలో అమో రీజియన్‌కు ఆడతున్న 18 ఏళ్ల హసన్.. బాంద్ఎఅమీర్‌తో జరిగిన మ్యాచ్‌లో 235 బంతుల్లో 143 పరుగులు (సెకెండ్ ఇన్నింగ్స్) చేసి ఔటయ్యాడు. ఈ ఫార్మాట్‌లో హసన్‌కు ఇది తొలి సెంచరీ.

ఈ మ్యాచ్‌లో హసన్ కష్టాల్లో ఉన్న తన జట్టును గట్టెక్కించి భారీ స్కోర్ చేయడానికి దోహదపడ్డాడు. అంతకుముందు కమాల్ ఖాన్ (105), సెదిఖుల్లా పచా (77) కూడా సత్తా చాటడంతో అమో రీజియన్ తొలి ఇన్నింగ్స్‌లో 350 పరుగులు చేసింది.

అనంతరం బాంద్ఎఅమీర్ జట్టు ఓపెనర్ హరూన్ ఖాన్ (109) సెంచరీతో ఆదుకోవడంతో తొలి ఇన్నింగ్స్‌లో 274 పరుగులు చేయగలిగింది. అమో బౌలర్లలో సఖీ 4 వికెట్లు తీశాడు. 76 పరుగుల తొలి ఇన్నింగ్స్ లీడ్‌తో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అమో టీమ్.. హసన్ సెంచరీతో సత్తా చాటడంతో 235 పరుగులు చేసి, ప్రత్యర్థి ముందు 312 పరుగుల లక్ష్యాన్ని ఉంచింది.

**45 బంతుల్లో 150 పరుగులు**

హసన్ గతేడాది తొలిసారి వార్తల్లో నిలిచాడు. కాబుల్ ప్రీమియర్ లీగ్ 2024లో 45 బంతుల్లో 150 పరుగులు చేసి రాత్రికిరాత్రి హీరో అయిపోయాడు. ఈ ఇన్నింగ్స్‌లో హసన్ రికార్డు స్థాయిలో 19 సిక్సర్లు కొట్టాడు. హసన్ గతేడాది అండర్19 వరల్డ్‌కప్‌లో ఆఫ్ఘనిస్తాన్‌కు ప్రాతినిథ్యం వహించాడు. ప్రస్తుతం పాకిస్తాన్ సూపర్ లీగ్ ఆడుతున్న హసన్ తండ్రి నబీ కొడుకుతో పాటు అంతర్జాతీయ క్రికెట్ ఆడాలని ముచ్చట పడుతున్నాడు.

## బంగ్లాదేశ్ మిడిలార్డర్ బ్యాటర్ తౌహిద్ హృదోయ్ నిషేధం గురయ్యాడు

ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో టీమిండియాపై సంచలన శతకం సాధించి వార్తల్లో నిలిచిన బంగ్లాదేశ్ మిడిలార్డర్ బ్యాటర్ తౌహిద్ హృదోయ్ నిషేధానికి గురయ్యాడు. ఢాకా ప్రీమియర్ లీగ్ 2025లో ఓ మ్యాచ్ సందర్భంగా అంపైర్ నిర్ణయానికి వ్యతిరేకంగా స్పందించినందుకు అతడిపై నాలుగు మ్యాచ్‌ల సస్పెన్షన్ (8 డీమెరిట్ పాయింట్లతో పాటు) విధించబడింది. దీంతో హృదోయ్ ఈ సీజన్‌లో అబాహీనీ జట్టుతో జరిగే కీలక మ్యాచ్‌తో పాటు వచ్చే సీజన్‌లో తొలి మూడు మ్యాచ్‌లకు దూరం కానున్నాడు. హృదోయ్ ఢాకా ప్రీమియర్ లీగ్‌లో (DPL) మొహమ్మడెన్ ఫ్రాంచైజీకి ప్రాతినిథ్యం వహిస్తున్నాడు. ఘాజీ గ్రూప్‌తో జరిగిన మ్యాచ్‌లో 54 బంతుల్లో 37 పరుగులు చేసి ఔటైన తర్వాత అంపైర్ నిర్ణయంపై అసంతృప్తిని వ్యక్తం చేశాడు.

24 ఏళ్ల హృదోయ్ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో టీమిండియాతో జరిగిన మ్యాచ్‌లో అద్భుత సెంచరీ చేశాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 35 పరుగులకే సగం వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉండగా హృదోయ్ సూపర్ సెంచరీతో (118 బంతుల్లో 100; 6 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆదుకున్నాడు. జాకిర్ అలీతో (68) కలిసి ఆరో వికెట్‌కు 154 పరుగుల అమూల్యమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. తద్వారా బంగ్లాదేశ్ గౌరవప్రదమైన స్కోర్ చేయగలిగింది. అనంతరం భారత్ సులువగా లక్ష్యాన్ని ఛేదించినా హృదోయ్ ఇన్నింగ్స్ అందరినీ ఆకట్టుకుంది. శుభ్‌మన్ గిల్ సూపర్ సెంచరీ (101 నాటౌట్) చేసి భారత్‌ను గెలిపించాడు. రోహిత్ శర్మ (41), కేఎల్ రాహుల్ (41 నాటౌట్) కీలకమైన ఇన్నింగ్స్‌లు ఆడారు. ఆ టోర్నీలో భారత్ ఫైనల్లో న్యూజిలాండ్‌పై విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. ఈ టోర్నీకి పాక్ ఆతిథ్యమివ్వగా, భద్రతా కారణాల దృష్ట్యా భారత్ తమ మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడింది.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar,
Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2013/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in